Follow: @ANNTELUGU
23-10-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 257 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఐక్యతే దేశానికి బలం

2047 నాటికి వికసిత్ భారత్‌ను నిర్మించాలి

దత్తన్న అలయ్ బలయ్ లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హాజరైన గవర్నర్ శివప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్

**హైదరాబాద్, మహా :** 2047 నాటికి భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ఆకలి, దప్పులు లేని సమాజాన్ని నిర్మించడంతో పాటు అవినీతికి, అఘాయిత్యాలకు తావులేని దేశంగా భారత్‌ను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో పాలగొన్న వెంకయ్య నాయుడు దేశ ప్రజలందరికీ అలయ్ బలయ్, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో భారతీయుల మధ్య ఉన్న విభేదాలను బ్రిటిష్ పాలకులు తమకు అనుకూలంగా మలుచుకుని దేశాన్ని పాలించారని, ఆ క్రమంలో మన సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీశారని గుర్తుచేశారు. అందువల్ల మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### ఇన్ స్టాగ్రామ్ లోకి సోనియాగాంధీ



- తొలి పోస్ట్‌తోనే సోషల్ మీడియాలో వైరల్
- రాబోయే జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'
- తొలి లుక్‌ను అభిమానులతో పంచుకున్న నేత

03

### ఏపీలో ఎన్నికల తేదీల్లో మార్పు



- నవంబర్ 1న పట్టణ, నగర ఎన్నికలు
- ప్రక్రియ మరో నాలుగురోజులు పొడిగింపు
- మిగతాంతా సేమ్ టు సేమ్

02

### అమిత్ షా బర్త్ డే విషెస్ తెలిపిన మహేశ్ బాబు



- వెల్లువెత్తిన జన్మదిన శుభాకాంక్షలు

02




## హైదరాబాద్‌లో భారీ సైబర్ దోపిడీ

**కేవలం 87 నిమిషాల్లో రూ. 3.34 కోట్లు లూటీ..**

**హైదరాబాద్, మహా :** రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ సైబర్ దోపిడీ వెలుగు చూసింది. రాయదుర్గంలోని ఒక ప్రముఖ నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ సిస్టమ్‌లని లక్ష్యంగా చేసుకున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లు, అత్యంత చాకచక్యంగా కంపెనీ డిజిటల్ నెట్‌వర్క్‌లోకి చొరబడ్డారు. ఉదయం 10:31 గంటల నుంచి 11:58 గంటల మధ్య కేవలం 87 నిమిషాల వ్యవధిలోనే రూ. 3.34 కోట్ల నిధులను అక్రమంగా లూటీ చేశారు. ఈ సైబర్ దాడిలో కేటుగాళ్లు సదరు సంస్థకు చెందిన బేగంపేట బ్రాంచ్ బ్యాంక్ ఖాతాను లక్ష్యంగా చేసుకున్నారు మిగతా 2వ పేజీలో

### బీసీ కులగణనలో తప్పులుంటే

# సరిచేస్తాం

**సీఎం రేవంత్ కీలక ప్రకటన**

వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన

వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ

ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ

పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ

హైదరాబాద్, మహా :

బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా నమోదైందని భావిస్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు.తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీడీ జాబితా నుంచి బీసీఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి మిగతా 2వ పేజీలో





## తెలంగాణకు మోదీ షా

- నవంబర్ లో అమిత్ షా, డిసెంబర్ లో ప్రధాని మోదీ రాక
- ఏర్పాట్లపై పార్టీ నేతలకు రాంచందర్ రావు దిశా నిర్దేశం

హైదరాబాద్, మహా : తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన డిసెంబర్ నెలలో ఉంటుందని రాష్ట్ర బీజేపీ స్పష్టం చేసింది. వరంగల్‌లో రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ సెంటర్, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌ను జాతికి అంకితం చేయడంతో పాటు ములుగులో సమ్మక్క సారక్క యూనివర్సిటీ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో నవంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటిస్తారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. మొత్తానికి పశ్చిమ బెంగాల్ తర్వాత బీజేపీ తెలంగాణపై ఫోకస్ చేసిందన్న విషయం స్పష్టమవుతోంది. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్ రావులు పాల్గొన్నారు. బీజేపీ ముఖ్యనేతలు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ఇతర నేతలు కూడా ఉన్నారు. ఈ సమావేశంలో బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ బీజేపీ నవంబర్ 1న హైదరాబాద్‌లో భారీ ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టనుంది. సర్‌పై కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీలు చేస్తున్న రాద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీ వివిధ కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ పాదయాత్ర చేయనున్నట్లు వెల్లడించింది. "ప్రజాస్వామ్యాన్ని రక్షించండి, గుంపు సామ్యాన్ని ఓడించండి" అంటూ తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్‌రావు పిలుపునిచ్చారు. దేశాన్ని బీజేపీ మాత్రమే రక్షిస్తుందనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. అదే విధంగా ప్రధాని, కేంద్ర హోం మంత్రి రాష్ట్ర పర్యటన నేపథ్యంలో పార్టీ చేపట్టాల్సిన ఏర్పాట్లపై కూడా చర్చించారు. అయితే కేంద్ర పార్టీతో పూర్తి స్థాయిలో చర్చించిన అనంతరం పూర్తి స్పష్టత వస్తుందన్న సమాచారాన్ని రాంచందర్ రావు పార్టీ నేతలకు స్పష్టం చేశారు. మిగతా 2వ పేజీలో



## శ్రీకాకుళంలో సరికొత్త రాజకీయం

- వైఎస్సార్‌సీపీ గూటికి గుండ లక్ష్మీదేవి!
- వైఎస్ జగన్ సమక్షంలో ఫ్యాన్ తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే.
- శ్రీకాకుళం మేయర్ అభ్యర్థిగా బరిలోకి దింపాలని వైఎస్ జగన్ నిర్ణయం.

**అమరావతి, మహా :** ష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఉత్తరాంధ్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచుకోటగా నిలిచిన 'గుండ' కుటుంబం టీడీపీకి గుడ్‌బై చెప్పింది. సుమారు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుబంధాన్ని తెంచుకుంటూ శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ మిగతా 2వ పేజీలో

## కడపలో హైటెన్షన్

- రాళ్లదాడులు, గన్‌తో కాల్పులు
- టీడీపీలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ



**కడప, మహా :** కడప జిల్లా నందలూరులో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తెలుగుదేశం పార్టీలోని రెండు వర్గాల మధ్య మొదలైన వివాదం కాస్తా ఘర్షణగా మారింది. ఇరువర్గాలు పరస్పరం రాళ్లు, కర్రలు, కుర్చీలతో దాడులకు దిగడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఈ క్రమంలో గాల్లోకి ఐదు రౌండ్ల కాల్పులు జరగడం స్థానికంగా కలకలం రేపింది. పలు వాహనాలు ధ్వంసం కావడంతో పాటు కారుకు నిప్పు పెట్టిన ఘటనతో నందలూరులో భయాందోళనలు నెలకొన్నాయి. కడప జిల్లా రాజంపేట నియోజకవర్గ పరిధిలోని నందలూరులో టీడీపీకి చెందిన బాలసుబ్రహ్మణ్యం, ఎద్దుల విజయసాగర్ వర్గాల మధ్య ఈ ఘర్షణ చోటు చేసుకున్నట్లు సమాచారం మిగతా 2వ పేజీలో

### రూ. 20 వాటర్ బాటిల్ కోసం

## నిండు ప్రాణం బలి!

- భార్యాపిల్లలు ఉన్నారని వేడుకున్నా కనికరించని మానవ మృగాలు.
- కరెంటు స్తంభానికి కట్టేసి రెండు గంటల పాటు కర్రలతో చితకబాది హత్య.



**విజయవాడ, మహా.** మనిషి ప్రాణం విలువ కేవలం ఇరవై రూపాయల కంటే తక్కువైపోయింది. గుక్కెడు మంచినీళ్ల కోసం రూ. 20 విలువ చేసే వాటర్ బాటిల్ తీశాడన్న కారణంతో ఓ చిరుద్యోగిని నలుగురు వ్యక్తులు అత్యంత పాశవికంగా కొట్టి చంపారు. తనకు భార్య, ముగ్గురు పసిపిల్లలు ఉన్నారని, ప్రాణాలతో వదిలేయాలని చేతులు మిగతా 2వ పేజీలో









## బీసీ కులగణనలో తప్పులుంటే
# సరిచేస్తాం

( మొదటి పేజీ తరువాయి )

వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు. తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## ఇన్‌స్టాగ్రామ్ లోకి సోనియాగాంధీ



**న్యూఢిల్లీ, మహా :** సోనియా గాంధీ గురువారం అధికారికంగా ఇన్‌స్టాగ్రామ్ లోకి అడుగుపెట్టారు. సోషల్ మీడియా వేదికగా ఆమె తన రాబోయే జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' తొలి లుక్‌ను అభిమానులతో పంచుకున్నారు. నవంబర్ 10న విడుదల కానున్న ఈ పుస్తక పరిచయ వేడుకలో భాగంగా ఆమె ఈ పోస్ట్ చేశారు. సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్‌లో తన తొలి పోస్ట్‌లో 79 ఏళ్ల సోనియా గాంధీ ఈ ప్రత్యేక క్షణాన్ని అందరితో పంచుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. "హలో అందరికీ.. ఈ క్షణాన్ని మీ అందరితో పంచుకోవడం నాకు నిజంగా చాలా ఆనందంగా ఉంది. అదే నా జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' తొలి లుక్" అని ఆమె క్యాప్షన్‌లో రాసుకొచ్చారు. "ఇది ప్రేమ, బాధ్యత, నష్టం , మనకంటూ ఒక చోటును వెతుక్కునే ప్రయాణానికి సంబంధించిన కథ. దీనిని మీతో పంచుకోవడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు. ఈ పుస్తకం ద్వారా సోనియా గాంధీ తన బాల్య జీవితం నుండి ఇప్పటివరకు జరిగిన పలు ముఖ్యమైన ఘట్టాలను పంచుకున్నారు. యుద్ధానంతర ఇటలీలో గడిపిన ఆమె బాల్య రోజులు. కేంబ్రిడ్జ్‌లో చదువుతున్న సమయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో ఏర్పడిన పరిచయం, ఆపై ప్రేమ ప్రయాణం. తన అత్తగారైన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, అలాగే భర్త రాజీవ్ గాంధీ హత్యల వంటి తీవ్ర వ్యక్తిగత విషాదాలు అవి ఆమె జీవితాన్ని, భారతదేశంతో ఆమెకున్న అనుబంధాన్ని ఎలా ప్రభావితం చేశాయనే విషయాలు ఇందులో ఉన్నాయి. ఇటలీలో జన్మించిన సోనియా గాంధీ.. 1965లో ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్‌లో రాజీవ్ గాంధీని కలుసుకున్నప్పుడు ఆమె వయస్సు 19 సంవత్సరాలు. ఆ తర్వాత 1968 ఫిబ్రవరి 25న వీరి వివాహం జరిగింది. అనంతరం ఆమె కాంగ్రెస్ పార్టీకి అత్యధిక కాలం అధ్యక్షురాలిగా సేవలందించిన నేతగా నిలిచారు. నెహ్రూగాంధీ కుటుంబంలో సభ్యురాలిగా ఆమె ఎదుర్కొన్న అనుభవాలు, భారతదేశంలో ఆమె జీవిత ప్రయాణాన్ని ఈ పుస్తకం ప్రతిబింబించనుంది. మొత్తానికి, తన జీవిత విశేషాలను పుస్తక రూపంలో తెస్తున్న సోనియా గాంధీ.. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంట్రీ ఇవ్వడం రాజకీయ వర్గాల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## అమిత్ షా బర్ డే విషెస్ తెలిపిన మహేశ్ బాబు

**ఢిల్లీ, మహా :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన పుట్టినరోజు గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేశవ్యాప్తంగా రాజకీయ నాయకులతో పాటు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు, అమిత్ షాకు తన శుభాకాంక్షలను 'ఎక్స్' ద్వారా తెలియజేశారు. "గౌరవనీయ కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారికి జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఇదే శక్తి, ఉత్సాహంతో దేశానికి సేవ చేస్తూనే ఉండాలి. ఈ ఏడాది మీకు గొప్పగా ఉండాలని కోరుకుంటున్నాను సార్" అని మహేశ్ బాబు తన పోస్టులో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అమిత్ షాకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ , నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, "భారత కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి గౌరవనీయ అమిత్ షా గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా, దీర్ఘాయుష్షుతో ఉండాలని, దేశ ప్రగతికి ఇలాగే తోడ్పడాలని శ్రీరాముడిని ప్రార్థిస్తున్నాను. జై శ్రీరామ్!" అని ట్వీట్ చేశారు. వీరితో పాటు బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్, తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్ కూడా అమిత్ షాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన దేశానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. పలువురు సినీ తారలు ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని కోరుకుంటూ పోస్టులు పెట్టారు.

## ఏపీలో ఎన్నికల తేదీల్లో మార్పు

**నవంబర్ 1న పట్టణ, నగర ఎన్నికలు**
**ప్రక్రియ మరో నాలుగురోజులు పొడిగింపు**
**మిగతాంతా సేమ్ టు సేమ్**



విజయవాడ, మహా : ఆంధ్రప్రదేశ్‌లో జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడ్డాయి. అక్టోబర్ 28న జరగాల్సిన మున్సిపల్ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం నవంబర్ 1వ తేదీకి వాయిదా వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 99 పట్టణ, నగర స్థానిక సంస్థల ఎన్నికలను రీషెడ్యూల్ చేస్తూ ఈసీ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1న పోలింగ్ నిర్వహించనుండగా, నవంబర్ 3న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను నాలుగు రోజులు వాయిదా వేసినట్లు ఈసీ వెల్లడించింది. దీని ప్రకారం ఈ నెల 25న పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. మరోవైపు మైదుకూరు మున్సిపాలిటీకి సంబంధించి పోలింగ్ తేదీని ఎన్నికల సంఘం ప్రస్తుతం ప్రకటించలేదు. మైదుకూరులో నిబంధనల ప్రకారం మళ్లీ నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాతే పోలింగ్ తేదీని ఖరారు చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

# ఐక్యతే దేశానికి బలం

(( మొదటి పేజీ తరువాయి)

ప్రజల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మనుషుల మధ్య ప్రేమను పంచుతూ, ఆత్మీయ అనుబంధాలను బలోపేతం చేసే గొప్ప వేదిక అలాయ్ బలాయ్ అని అన్నారు. మా నవత్వాన్ని ముందుకు తీసుకెళ్లే ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన మధ్య ఉన్న అనుబంధాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు.

దేశానికి, సమాజానికి అన్నింటికంటే ముఖ్యమైనది ఐక్యత అని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. భారతీయులందరూ భిన్నత్వాన్ని గౌరవిస్తూ సమైక్యంగా ఉండాలని, ప్రకృతితో మమేకమై జీవించే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. దేశాభివృద్ధితో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, భాషలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ముఖ్యంగా మాతృభాష తెలుగును పరిరక్షించాలని పిలుపునిచ్చారు. మాతృభాష మన కంటి చూపు లాంటిదని, దానిని నిర్లక్ష్యం చేయకుండా భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాలని అన్నారు. పరస్పర కలహాలకు దూరంగా ఉంటూ ప్రేమ, ఆప్యాయత, మానవత్వంతో ముందుకు సాగినప్పుడే అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు.

రెండు దశాబ్ధాలుగా బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా అలాయ్ బలాయ్ జరిగింది. పార్టీలకు అతీతంగా ప్రముఖలందరినీ ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నేతలు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. అలయ్ బలయ్ కార్యక్రమంలో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్‌చంద్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నేత వీహెచ్ హనుమంతరావు, సీపీఐ నేత కూనమనేని సాంబశివరావు పాల్గొన్నారు.

**ఇలాంటి కార్యక్రమాలు అవసరం**

దత్తాత్రేయ నిర్వహిస్తున్న అలయ్ బలయ్ కార్యక్రమం ప్రశంసనీయమని ప్రముఖులు కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సద్భావనను పెంచుతాయని, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల యువత గర్వపడాలని, నషా ముక్త్ భారత్ కోసం మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ సాధన ప్రధాని మోదీ ధ్యేయమని, డ్రగ్స్ వాడకం వల్ల యువత నిర్వీర్యం అవుతుందని, అన్ని విబేధాలను పక్కకు పెట్టి దేశం కోసం ఆలోచించాలని పేర్కొన్నారు. అలయ్‌బలయ్ కార్యక్రమం అసలైన దసరా పండుగలా అనిపిస్తుందని, మన రాజ్యాంగంలో సౌభ్రాతృత్వం అనే పదం చేర్చడానికి అంబేద్కర్ ఎంతో కృషి చేశారని విద్యాసాగర్ కొనియాడారు. ప్రపంచమంతా భారత్‌వైపే చూస్తోందని, అన్నింటిలోనూ భారతదేశాన్ని గురువుగా భావిస్తున్నారని వెల్లడించారు. అలయ్ బలయ్ కార్యక్రమం ద్వారా కులమతాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తీసుకొస్తున్నారు. సోదరభావం, సామాజిక సమైక్యతకు నిదర్శనంగా ఈ కార్యక్రమం నిలుస్తోంది. వివిధ రంగాల్లోని ప్రతిభావంతులు, కళాకారులను బండారు దత్తాత్రేయ, విజయలక్ష్మి సన్మానించారు. తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చారు.

## రూ. 20 వాటర్ బాటిల్ కోసం
# నిండు ప్రాణం బలి!

( మొదటి పేజీ తరువాయి )

జోడించి వేడుకున్నా ఆ మానవ మృగాల గుండె కరగలేదు. కరెంటు స్తంభానికి కట్టేసి ఏకంగా రెండు గంటల పాటు కర్రలతో చితకబాది నిండు ప్రాణాన్ని బలిగొన్నారు. సభ్యసమాజం తలదించుకునే ఈ దారుణ ఘటన విజయవాడలోని పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసి తీవ్ర కలకలం రేపింది.

**విశాఖ వెళ్తున్నానని చెప్పి.. విగతజీవిగా!**

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని నల్గొండకు చెందిన మాస సాయికుమార్ (33) ఉపాధి నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. వారం రోజుల క్రితం పని నిమిత్తం విశాఖపట్నం వెళ్తున్నానని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకులకు చెప్పి సాయికుమార్ బయలుదేరాడు. ఈ క్రమంలో విజయవాడ చేరుకున్న అతడు.. ఈ నెల 18వ తేదీ అర్ధరాత్రి దాటాక పటమట ప్రాంతంలోని ఓ మద్యం దుకాణం వద్ద ఉన్న పాన్ షాపు దగ్గరకు వచ్చాడు.

అక్కడ దాహం వేయడంతో ఫ్రిజ్‌లో ఉన్న రూ. 20 విలువైన వాటర్ బాటిల్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఓ పాల వ్యాన్ డ్రైవర్ ఇది గమనించి, సాయికుమార్‌ను దొంగగా భావించి పట్టుకున్నాడు. పాన్ షాపులో పనిచేసే రవిశంకర్‌కు అతడిని అప్పగించి డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

స్తంభానికి కట్టేసి.. నరకం చూపించి.

అక్కడి నుంచే అసలు ఘోరం మొదలైంది. పాన్ షాపు ఉద్యోగి రవిశంకర్, సమీపంలోని బార్‌లో పనిచేసే అయ్యప్పశంకర్‌తో కలిసి సాయికుమార్‌పై విచక్షణా రహితంగా దాడి చేయడం ప్రారంభించారు. ఇంతలో అక్కడికి వచ్చిన పోతంశెట్టి నవీన్, సాయిప్రణీత్ అనే మరో ఇద్దరు యువకులు కూడా వీరితో జతకలిశారు. నలుగురూ కలిసి సాయికుమార్‌ను కాళ్లతో తన్నుతూ, పిడిగుద్దులు కురిపిస్తూ నేలపై ఈడ్చుకుంటూ దుకాణం వెనుక ఉన్న చీకటి సందులోకి తీసుకెళ్లారు.

"అన్నా.. నాకు భార్య, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు. నన్ను కొట్టకండి, వదిలేయండి" అంటూ సాయికుమార్ కన్నీళ్లతో కాళ్లావేళ్లా పడినా వారు కనికరం చూపలేదు. పైశాచిక ఆనందంతో అతడి చేతులను వెనక్కి విరిచి కరెంటు స్తంభానికి కట్టేశారు. అనంతరం లావుపాటి కర్రలతో సుమారు రెండు గంటల పాటు విరామం లేకుండా ఒళ్లంతా చితకబాదారు. తీవ్ర రక్తస్రావమై, అంతర్గత అవయవాలు దెబ్బతినడంతో సాయికుమార్ ఆ స్తంభం వద్దే ప్రాణాలు విడిచాడు. అతడు చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.

**పట్టించిన సీసీటీవీ కెమెరాలు.**

మరుసటి రోజు ఉదయం రక్తపు మడుగులో పడి ఉన్న సాయికుమార్ మృతదేహాన్ని చూసిన స్థానికులు భయాందోళనకు గురై పటమట పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహంపై ఉన్న తీవ్ర గాయాలను బట్టి ఇది ముమ్మాటికీ హత్యేనని నిర్ధారించుకున్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని నిశితంగా పరిశీలించగా.. నలుగురు వ్యక్తులు సాయికుమార్‌ను ఈడ్చుకెళ్తున్న దృశ్యాలు, దాడి చేసిన తీరు స్పష్టంగా రికార్డయ్యాయి. సీసీటీవీ ఆధారాలతో నిందితులను రవిశంకర్, అయ్యప్పశంకర్, పోతంశెట్టి నవీన్, సాయిప్రణీత్‌లుగా గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు. కేవలం రూ. 20 వాటర్ బాటిల్ కోసం ఇంతటి ఘోరానికి ఒడిగట్టారని తెలియడంతో స్థానికులు నివ్వెరపోతున్నారు. ఇంటికి తిరిగి వస్తాడనుకున్న భర్త విగతజీవిగా మారడంతో సాయికుమార్ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నం

## పాలమూరు నుంచి డిండికి
# నీటి తరలింపును ఆపండి

**ఉత్తమ్‌కు జూపల్లి సహా**
**పాలమూరు నేతల విజ్ఞప్తి**

హైదరాబాద్, మహా : పాలమూరు ప్రాజెక్టుల విషయంలో ఇవాళ కీలక పరిణామం చోటు చేసుకుంది. పాలమూరు నుంచి డిండి ప్రాజెక్టుకు నీటి తరలింపును ఆపాలని జిల్లా ప్రతినిధులు మంత్రి జూపల్లి క్రిష్ణారావు, ఎంపీ మల్లురవి సహా ఎమ్మెల్యేలు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పనులను త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన్ మంత్రిని కోరినట్లు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజా ప్రతినిధులు తెలిపారు. ఏదుల నుంచి డిండికి నీటిని తరలించే అంశాన్ని చర్చించినట్లు చెప్పారు. ఈ అంశంపై అధికారులతో చర్చించి అన్ని ప్రాంతాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఉమ్మడి పాలమూరు ప్రజాప్రతినిధులు వెల్లడించారు.

**గంటన్నర పాటు చర్చలు**

డిండి ప్రాజెక్టుకు నీటి తరలింపు అంశం పాలమూరు జిల్లా నేతల్లో గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెంది మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఆ జిల్లా ఎమ్మెల్యేలు జూబ్లీహిల్స్‌లోని ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆయన ఇంట్లో కలిశారు. దాదాపు గంటన్నరపాటు ఉత్తమ్ కుమార్ రెడ్డితో జరిగిన సమావేశంలో డిండి నీటి తరలింపుతో పాటు పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులపైనా చర్చించారు.



## దత్తిరాజేరు జడ్పీటీసీ నామినేషన్ కు మంత్రి కొండపల్లి

**మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన వెంకట రామ సింహాచలం**

విజయనగరం, మహా విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ అభ్యర్థిగా మిత్తిరెడ్డి వెంకట రామ సింహాచలం గురువారం నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెంట రాగా విజయనగరం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. మంత్రి కొండపల్లి ఆశీస్సులతో నామినేషన్ దాఖలు చేసిన రామసింహాచలం ఇది కేవలం నామినేషన్ కాదని, దత్తిరాజేరు ప్రజల పట్ల ఒక బాధ్యతను స్వీకరించే అడుగని అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ.. డల అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తానని, ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ ఫ్యూచర్ లోకేష్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లు ఈ ప్రాంత ప్రగతికి, రాష్ట్రప్రగతికి చేస్తున్న కృషే దత్తిరాజేరు ప్రజల ఆదరణ టీడీపీకి అందిస్తున్నదన్నారు. తనకు ఈ అవకాశం అందించిన పార్టీ నాయకత్వానికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



## కడపలో హైటెన్షన్

( మొదటి పేజీ తరువాయి )

. మరోవైపు మేడా విజయశేఖర్‌రెడ్డి వర్గానికి చెందిన అభ్యర్థి నామినేషన్ వేయడానికి రావడంతో వివాదం మొదలైనట్లు తెలుస్తోంది. తమ వర్గం సూచించిన అభ్యర్థులకే అవకాశం ఇవ్వాలని ఇరువర్గాలు పట్టుబట్టడంతో వాగ్వాదం తీవ్రరూపం దాల్చింది. పార్టీ తరఫున నామినేషన్ వేసే అభ్యర్థి విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ఘర్షణకు దిగారు.

**రాళ్లు, కర్రలతో దాడులు.. వాహనాలకు నిప్పు**

మొదట మాటలతో ప్రారంభమైన గొడవ కొద్దిసేపటికే హింసాత్మకంగా మారింది. ఇరువర్గాల వారు రాళ్లు, కర్రలు, కుర్చీలతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో పలువురికి గాయాలైనట్లు తెలిసింది. ఘర్షణ కారణంగా పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఒక కారుతో పాటు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. మరో కారుకు దుండగులు నిప్పు పెట్టడంతో అది పూర్తిగా దగ్ధమైనట్లు సమాచారం. మేడా విజయశేఖర్‌రెడ్డిపై కూడా దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో నందలూరులో కొంతసేపు యుద్ధ వాతావరణం నెలకొంది. స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.గాల్లోకి ఐదు రౌండ్ల కాల్పులు ఘర్షణ తీవ్రత పెరగడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ఓ టీడీపీ నేత గాల్లోకి ఐదు రౌండ్ల కాల్పులు జరిపినట్లు సమాచారం. తిరుపతికి చెందిన ఎలైట్ ఆసుపత్రి చైర్మన్‌గా ఉన్న బాలసుబ్రహ్మణ్యం కాల్పులు జరిపినట్లు వివిధ కథనాల్లో పేర్కొన్నారు. కానీ దీన్ని న్యూస్ 18 పూర్తిగా నిర్ధారించ లేదు. అయితే, ఈ కాల్పుల ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది.

రంగంలోకి పోలీసులు ఘర్షణ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాల వారిని చెదరగొట్టేందుకు లాఠీఛార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. కాల్పులు, వాహనాల దహనం, దాడులకు సంబంధించి విచారణ చేపట్టారు. నామినేషన్ల వివాదం హింసాత్మకంగా మారడంతో నందలూరులో ఉద్రిక్తత కొనసాగింది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, కాల్పులు జరిపిన అంశం, ఆస్తుల ధ్వంసంపై పోలీసుల దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## శ్రీకాకుళం లో సరికొత్త రాజకీయం

**వైఎస్సార్‌సీపీ గూటికి గుండ లక్ష్మీదేవి!**
**వైఎస్ జగన్ సమక్షంలో ఫ్యాన్ తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే.**
**శ్రీకాకుళం మేయర్ అభ్యర్థిగా బరిలోకి దింపాలని వైఎస్ జగన్ నిర్ణయం.**

**అమరావతి, మహా :** ష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఉత్తరాంధ్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచుకోటగా నిలిచిన 'గుండ' కుటుంబం టీడీపీకి గుడ్‌బై చెప్పింది. సుమారు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుబంధాన్ని తెంచుకుంటూ శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకురాలు గుండ లక్ష్మీదేవి గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమెకు, ఆమె ముఖ్య అనుచరులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

నాలుగు దశాబ్దాల సేవకు దక్కని గౌరవం.

దివంగత ఎన్టీఆర్ పిలుపుతో 1985లో రాజకీయాల్లోకి వచ్చిన గుండ కుటుంబానికి శ్రీకాకుళం నియోజకవర్గంలో తిరుగులేని ప్రజాబలం ఉంది. లక్ష్మీదేవి భర్త, దివంగత గుండ అప్పలసూర్యనారాయణ టీడీపీ తరఫున నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా సేవలందించారు. అనంతరం 2014 ఎన్నికల్లో గుండ లక్ష్మీదేవి శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించారు. అయితే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమెకు టికెట్ నిరాకరించినప్పటికీ పార్టీ ఆదేశాలకు కట్టుబడి పనిచేశారు.

కానీ, ఇటీవల తన భర్త అప్పలసూర్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు కనీసం పరామర్శకు కూడా టీడీపీ అధిష్టానం రాకపోవడం, ఆయన మరణానంతరం శ్రీకాకుళంలో విగ్రహం ఏర్పాటు చేయకుండా సొంత పార్టీలోని ప్రత్యర్థి వర్గమే అడ్డుకుని దిమ్మెలను ధ్వంసం చేయడం ఆమెను తీవ్రంగా కలచివేసింది. దీనికితోడు తాజా స్థానిక ఎన్నికల్లో శ్రీకాకుళం మేయర్ పీఠాన్ని ఆశించిన ఆమెకు.. కూటమి పొత్తులో భాగంగా ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో తీవ్ర నిరాశ ఎదురైంది. పార్టీలో జరుగుతున్న వరుస అవమానాలపై అధిష్టానానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో బుధవారం టీడీపీకి రాజీనామా చేసిన ఆమె, ధర్మాన సోదరుల చర్చలతో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు.

**శ్రీకాకుళం మేయర్ అభ్యర్థిగా గుండ లక్ష్మీదేవి!**

శ్రీకాకుళం పట్టణంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన లక్ష్మీదేవి రాకతో పార్టీకి తిరుగులేని బలం చేకూరుతుందని వైఎస్సార్‌సీపీ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా నేతలతో చర్చించిన వైఎస్ జగన్.. రాబోయే శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థిగా గుండ లక్ష్మీదేవిని బరిలోకి దింపాలని నిర్ణయించారు. ప్రస్తుతం జరుగుతున్న విడతలో కాకుండా డిసెంబర్‌లో శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో, ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని జగన్ దిశానిర్దేశం చేశారు. అంతేకాకుండా, ప్రస్తుతం జరుగుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఆమె వర్గానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా నేతలకు సూచించారు.

**నిబద్ధతతో పనిచేస్తా: గుండ లక్ష్మీదేవి.**

వైఎస్సార్‌సీపీలో చేరిన అనంతరం గుండ లక్ష్మీదేవి మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. "తెలుగుదేశం పార్టీ కోసం మా కుటుంబం 40 ఏళ్లపాటు రక్తం ధారపోసింది. కానీ మాకు చివరకు కన్నీళ్లు, అవమానాలే మిగిలాయి. నా భర్త విగ్రహాన్ని కూడా పెట్టుకోనివ్వకుండా అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతోనే వైఎస్ జగన్ నాయకత్వంపై నమ్మకంతో వైఎస్సార్‌సీపీలో చేరాను. ఏ పార్టీలో ఉన్నా క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయడం మా కుటుంబ నైజం. జగన్ అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తూ శ్రీకాకుళంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో భారీ సైబర్ దోపిడీ

( మొదటి పేజీ తరువాయి )



. అత్యాధునిక హ్యాకింగ్ మెళకువలను ఉపయోగించి, సంస్థ అంతర్గత సిస్టమ్‌లను హ్యాక్ చేసిన నేరగాళ్లు, కంపెనీ అనుమతి లేకుండానే నిధులను విదేశీ , స్వదేశీ నెట్‌వర్క్‌ల ద్వారా మళ్లించారు. కేవలం గంటన్నర సమయంలోనే ఏకంగా 183 విడతల్లో అత్యంత వేగంగా ఈ లావాదేవీలు పూర్తి చేసి, దేశవ్యాప్తంగా ఉన్న 52 వేర్వేరు ఖాతాల్లోకి మొత్తం రూ. 3.34 కోట్లను బదిలీ చేశారు. సిస్టమ్‌లో అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ భారీ నిధుల మళ్లింపును గమనించిన కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయన అందించిన ఫిర్యాదు ఆధారంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో ఈ నిధులన్నీ బెంగళూరు, ఢిల్లీ, ముంబయి, ఉత్తరప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని బ్యాంకు ఖాతాలకు చేరినట్లు పోలీసులు గుర్తించారు. నిధులు మళ్లించిన ఈ 52 ఖాతాలన్నీ సైబర్ నేరగాళ్లు కమీషన్ల కోసం ఉపయోగించే 'మ్యూల్ ఖాతాలు' అయి ఉంటాయని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో డబ్బు డిపాజిట్ అయిన వెంటనే ఇతర విదేశీ లేదా క్రిప్టో ఖాతాల్లోకి మార్చకుండా నిరోధించేందుకు, ఐపీ చిరునామాలు , బ్యాంక్ ట్రాన్సాక్షన్ ట్రాక్‌ల ఆధారంగా పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తును వేగవంతం చేశారు.



## ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలి

- **పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన వరంగల్ సీపీ శ్వేత**
- **ఇన్‌స్పెక్టర్ కు పలు సూచనలు చేసిన సీపీ**

చౌరస్తా, మహా ; వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ సబ్ డివిజన్ లో ఉన్న ఇంతజార్ గంజ్ పోలీస్ స్టేషన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. **గురువారం దాదాపు ఉదయం 11**:40 గంటల **నుంచి 12**:40 గంటల వరకు పోలీస్ స్టేషన్ లో తనిఖీలు నిర్వహించిన కమిషనర్, స్టేషన్ లోపలి, బయటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంత జార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌కు పలు సూచనలు చేశారు. మన ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే పోలీస్ స్టేషన్ పరిసరాలతో పాటు స్టేషన్ పైన ఉన్న క్రైమ్ సెక్షన్ ను కూడా ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తూ, ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏసీపీ నర్సింగరావు, పోలీస్ అధికారులు, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.



## రెవెన్యూ అంశాల పై ప్రత్యేక దృష్టి సారించాలి

- **పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి**
- **ఆర్డీవోలు, తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్, కలెక్టరేట్ మహా; వరంగల్ జిల్లాలో రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీవోలు, తహశీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రీసర్వే, భూదాన్ భూములు, భూభారతి, నక్షా, రెవెన్యూ సదస్సులు, సాదాబైనామా, భూసేకరణ, ఇన్నర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారి 163జీ, విమానాశ్రయం, ఎస్ఐఆర్, ఎమ్మెల్సీ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయా అంశాలకు సంబంధించిన పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్,డియార్వో విజయలక్ష్మి వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి సంబంధిత మండలాల తహసీల్దార్లు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## డిసెంబరులో జాతీయ స్థాయి క్రీడా సంబురం

- **దేశవ్యాప్తంగా అథ్లెట్ల రా**
- **ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

హనుమకొండ, మహా; హనుమకొండ లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) మరో ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది. డిసెంబరులో నిర్వహించనున్న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి గురువారం జేఎన్ఎస్ స్టేడియాన్ని సందర్శించి, పోటీల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియంలోని క్రీడా ప్రాంగణం, క్రీడాకారులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జాతీయ స్థాయి పోటీలకు హనుమకొండ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. వసతి, పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి కొత్త ప్రశాంత్‌కు ఆదేశించారు. పోటీల సమయంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి స్టేడియంలో కొత్తగా నిర్మిస్తున్న మరుగుదొడ్లతోపాటు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, క్రీడా పోటీలు ప్రారంభమయ్యేలోపు అన్ని ఏర్పాట్లు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

## జర్నలిస్టులను తెలంగాణ ఉద్యమ కారులుగా గుర్తించండి

- **ఉద్యమకారుల జాబితాలో చేర్చి న్యాయం చేయండి**
- **టీజీ ఉద్యమకారుల కమిటీ చైర్మన్ కే.కేశవరావుకు జర్నలిస్టుల బహిరంగ లేఖ**



**వరంగల్, బ్యూరో మహా ;** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన మహా ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైంది. నిప్పు రవ్వలాంటి ఉద్యమానికి పెన్ను పట్టి అక్షరాల రూపంలో వరంగల్ తూర్పు జర్నలిస్టులు ఊపిరిని అందించారు. ఆంధ్రా, తదితర ప్రసార మాధ్యమాల యాజమాన్యాలకు నచ్చక పోయినా ఉద్యోగాలను, వారి జీవితాలను కూడా పణంగా పెట్టి నిధులు, నియామకాలు , నీళ్లు, మాకే (తెలంగాణ ప్రజలకే) దక్కాలనే బలమైన సంకల్పంతో జర్నలిస్టులు రోడ్డెక్కి కలం కవాతులు, రాస్తా రోఖోలు, భారీ ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేశారు. ఉద్యమంలో మొట్టమొదటగా టెంట్ వేసుకుని వరంగల్ చౌరస్తా లో వరంగల్ తూర్పు జర్నలిస్టులు దీక్షలు చేశాక.. ఆ స్ఫూర్తి తోనే రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు దీక్షలు చేశారని వరంగల్ తూర్పు జర్నలిస్ట్ పరపతి సంఘం అధ్యక్షులు కోరుకొప్పుల నరేందర్ గుర్తు చేశారు.ఉద్యమం లో జర్నలిస్టులు ఇది ప్రత్యక్షంగా చేసిందని తెలిపారు. ఉద్యమ వేడి చల్లార కూడదని రాష్ట్రాన్ని ఇప్పుడు సాధించుకోకపోతే ఎప్పుడూ సాధించుకోలేమని జర్నలిస్టులు కంకణం కట్టుకున్నారు. ఉద్యమం అనే వాహనంలో ప్రచారమనే ఇంధనం నింపి రాకెట్ స్పీడ్ తో ముందుకు దూసుకు పోయేలా చేసింది జర్నలిస్టులే అని ముఖ్యంగా సంఘాలు యూనియన్లకు అతీతంగా అందరూ రోడ్లెక్కి తెలంగాణ కోసం నినదించేలా చేసింది జర్నలిస్టులు అని పేర్కొన్నారు. ఆడ ,మగ, విద్యార్థులు, యువత, కార్మికులు, కర్షకులు, వృద్ధుల,పెన్షనర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులను, మహిళా సంఘాలను, కులసంఘాలను, వ్యాపార వాణిజ్య, పరపతి సంఘాల కు ప్రాధాన్యత ఇచ్చి తమ తమ ప్రసార, ప్రచురణల ద్వారా ఉద్యమానికి ఊపిరి పోయడం జరిగింది. వాళ్ళు చేసిన చిన్న కార్యక్రమానికి సైతం బూతద్దంలో పెట్టి పెద్ద కార్యక్రమంగా చూపి ఆనాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వణుకు పుట్టించేలా చేసింది జర్నలిస్టులు అని రాష్ట్ర సాధనకు తోడ్పడింది జర్నలిస్టు లే అని తెలిపారు. పోలీసులకు జర్నలిస్టుల కు మధ్య ఉన్న పరిచయాలు, అనుబంధం వల్ల కేసులు మోదు కాలేదు, కానీ నిజంగా పోలీసులు కేసులు పెట్టాలనుకుంటే జర్నలిస్టుల పైనే ఎక్కువ కేసులు పెట్టే వారిని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమానికి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇంత కృషి చేసిన జర్నలిస్టులను ప్రభుత్వం గుర్తించకపోవడం దురదృష్టకరం. పోలీసు కేసులు, జైలు జీవితం లేవనే నెపంతో జర్నలిస్టులను పక్కన పెట్టడం బాధాకరమైన అంశంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం పెట్టిన ఈ నిబంధన నుంచి జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలని ప్రసార సాధనాలు లేకుండా, జర్నలిస్టుల సహకారం లేకుండా ఏ ఉద్యమంలో, ఏ ఎన్నికల పోటీల్లో విజయ తీరాలను చేరిన దాఖలు చరిత్రలో లేవని ప్రతీ ఉద్యమ కారుడికి గుర్తింపు సహకారం అందించింది జర్నలిస్ట్ అని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి , ఉద్యమ కారుల కమిటీ చైర్మన్ కేశవరావు జర్నలిస్ట్ నేపథ్యమే కనుక జర్నలిస్టుల బాధను ఆలకించి, 2000 నుంచి 2014 వరకు జర్నలిస్టుగా పని చేసిన వారిని గుర్తించి ఉద్యమకారుల జాబితాలో చేర్చి తగిన విధంగా గౌరవించాలని సీనియర్ జర్నలిస్ట్ కోరుకొప్పుల నరేందర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఈహెచ్ఎస్ అమలుకు ఆరు ఆసుపత్రుల అంగీకారం

- **క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ పై ఆసుపత్రుల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం**



**క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ పై చర్చ**

వరంగల్,కలెక్టరేట్ మహా; వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన గురువారం జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు ఉద్యోగుల ఆరోగ్య పథకం ఈహెచ్ఎస్ అమలు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ అమలుకు సంబంధించిన అంశాల పై ఆసుపత్రుల ప్రతినిధులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల తో పాటు అర్హులైన లబ్ధిదారులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యల పై సమగ్రంగా చర్చించారు. ల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి సమన్వయం తో నిర్వహించిన ఈ సమీక్షలో జిల్లాలోని ఆరు ఆసుపత్రుల ప్రతినిధులు తమ ఆసుపత్రులలో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు చేసేందుకు అంగీకారం తెలిపారు. సందర్భంగా అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పథకం ద్వారా అందించే వైద్య సేవలను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. సమావేశంలో తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలు, ఆసుపత్రులు పాటించాల్సిన నిబంధనలు, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాల నిర్వహణ వంటి అంశాల పై చర్చించారు.ఆసుపత్రులు సంబంధిత చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు తప్పక చేపట్టాలని ఈ సందర్భంగా సూచించారు. వర్తించే నిబంధనల ప్రకారం ఫైర్ సేఫ్టీ అనుమతులు, ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ పొందడం ప్రాముఖ్యతను వివరించారు. సమావేశం ద్వారా ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలును విస్తరించడం తో పాటు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టానికి అనుగుణంగా ఆసుపత్రుల్లో నిబంధనల అమలు, భద్రతా ప్రమాణాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో పాల్గొని ఈ ఎచ్ ఎస్ అమలుకు అంగీకరించిన ఆసుపత్రుల ప్రతినిధులు. సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ - డాక్టర్ బందెల మోహన్ రావు, గంగా హాస్పిటల్ - డాక్టర్ శ్రవణ్ కుమార్, మార్క్యూర్ వెల్ హాస్పిటల్ - డాక్టర్ వి. రాకేష్సత్య హాస్పిటల్ - డాక్టర్ రాధాకృష్ణ తో పాటు బాలాజీ హాస్పిటల్ -డాక్టర్ శ్రీనివాసరావు, ఎస్.ఎస్.ఆర్. అపోలో హాస్పిటల్ మేనేజర్ సుమన్ ఉన్నారు. అలాగే ఈ సమావేశంలో డి ఎం ఎచ్ ఓ డా.రాజా రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ సంపత్ (నర్సంపేట), డాక్టర్ జాన్సన్ (నర్సంపేట), డాక్టర్ జి. రమేష్,డాక్టర్ నరేష్‌కుమార్, డాక్టర్ వి.ఎం.జైయుడు, ఆరోగ్య శ్రీ సమన్వయకర్త డాక్టర్ నిఖిల్ స్వరూప్, ఎస్ ఓ ప్రసన్న కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## టీజీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- **పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలి**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ, మహా;** ఈనెల 24, 26 తేదీల్లో జరగనున్న టీజీపీఎస్సీ అసిస్టెంట్ సైంటిస్ట్ ( అనలిస్టు గ్రేడ్ 2 ), అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్స్ ఇన్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో ఈ నెల 24, 26 తేదీల్లో టీజీపీఎస్సీ నిర్వహించే అసిస్టెంట్ సైంటిస్ట్ ( అనలిస్టు గ్రేడ్2 ), అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్స్ ఇన్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య, విద్యుత్, ఆర్టీసీ, పోలీస్, ఇతర శాఖల అధికారులతో పాటు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులతో పరీక్షా కేంద్రాలలో పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు, నిర్వహణ గురించి తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన టీజీపీఎస్సీ అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్టు గ్రేడ్ 2), 26వ తేదీన అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్స్ ఇన్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్మెంట్ టెస్ట్ ద్వారా నిర్వహిస్తుందన్నారు. ఈ పరీక్షలు ఉదయం 10 :00నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలలోనికి అభ్యర్థులను ఉదయం 8:30నుండి 9:30వరకూ, మధ్యాహ్నం 1:00 నుండి 2:00 లోపు అనుమతిస్తారని తెలిపారు. ఉదయం 9:30 గంటలకు, మధ్యాహ్నం 2:00 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేస్తారని పేర్కొన్నారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాలలోనికి అనుమతి ఉండదన్నారు. నిబంధనల మేరకు అరగంట ముందు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేస్తారు కాబట్టి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు. జిల్లాలో అయాన్ డిజిటల్ జోన్ (వడ్డేపల్లి), కిట్స్ కళాశాల (ఎర్రగట్టు గుట్ట), ఎన్ఎస్ గ్లోబల్ టెక్నాలజీస్ (గోపాల్ పూర్ కల్లుమండవ కూడలి) , నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ (చింతగట్టు ఫ్లైఓవర్ దగ్గర, హసన్ పర్తి), శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల (ములుగు క్రాస్ రోడ్ )లోని పరీక్షా కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్ 2) పరీక్షను 1320 మంది అభ్యర్థులు, అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్స్ ఇన్ పొల్యూషన్ కంట్రోల్ పరీక్షకు 1225 మంది అభ్యర్థులు రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, తనిఖీ విధానం, పటిష్ట పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు. పరీక్షల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షలకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షల నిర్వహణను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు, ఆర్టీసీ డిఎం ధరమ్ సింగ్, ఎస్బి పోలీస్ ఇన్స్పెక్టర్ ఎన్.చంద్ర మోహన్, విద్యుత్ శాఖ ఏడిఈ గంగారెడ్డి, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**ఊషన్నపల్లి పాఠశాలకు రూ.20 వేల గ్లాస్ బోర్డు వితరణ**

**పెద్దపల్లి మహా, :** కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, శాస్త్రీయ విద్య అందుతుందని దాత అనుముల అశోక్ రెడ్డి అన్నారు. గురువారం దసరా సెలవుల సందర్భంగా స్వగ్రామమైన ఊషన్నపల్లికి వచ్చిన ఆయన, గ్రామంలోని ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.20 వేల విలువైన గ్లాస్ బోర్డును తన తండ్రి, తమ్ముడు అనుముల రాజేశం, అనుముల శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ పాత్రికేయుడు ముస్కు అశోక్, రేకుల రఘుతో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో అందమైన భవనాలు, విద్యార్థులకు ఉపయోగపడే చిత్రాలు, పదజాలాన్ని పెంపొందించే అంశాలతో కూడిన బోధనా వాతావరణం ఆకట్టుకుంటోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలకు ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు సైతం పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాతలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



## ఈనెల 25 26 చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**

**మొయినాబాద్ మహా:** సిఐటియు మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అజీజ్ నగర్ లో సిఐటియు చలో హైదరాబాద్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ ఈనెల 25 26 తేదీలలో చలో హైదరాబాద్ కార్యక్రమం సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతుందని ముఖ్యంగా నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం ఉద్యోగ సామాజిక భద్రత కార్మికులకు కల్పించాలని ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని, పిఆర్సి అమలు డిఏ వర్తింపు ప్రభుత్వం కార్మికులకు ఎన్నికల హామీ ఇచ్చిందని వాటిని అమలు చేయాలని 25వ తారీఖున పారిశ్రామిక రంగ కార్మికులు సింగరేణి ఆర్టీసీ విద్యుత్ ఉద్యోగులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేసే ఉద్యోగుల సమస్యలపై ధర్నా ఉంటుంది. 26వ తారీఖున స్కీం వర్కర్లు, అవుట్సోర్సింగ్, స్థానిక సంస్థలు ,యూనివర్సిటీస్, మెడికల్ ఉద్యోగులు, పెన్షనర్స్ ,బీడీ కార్మికుల, బిల్డింగ్ ట్రాన్స్పోర్ట్ హమాలీ కార్మికుల సమస్యలపై ధర్నా కార్యక్రమం ఉంటుందని అన్నారు మొయినాబాద్ నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు మొయినాబాద్ మండల కన్వీనర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షులు ముంజగల రత్నం, మున్సిపల్ అధ్యక్షులు సుధాకర్ అంజయ్య, ఆశా కార్యకర్తలు భవాని, ప్రమీల మహేందర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## కెమెరాలున్నా దొరకని దొంగలు.. పోలీసులకు సవాల్

**మొయినాబాద్ మహా :** సీసీ కెమెరాలు ఉన్నా దొంగలను పట్టుకోవడంలో జాప్యం జరుగుతుండటంతో మొయినాబాద్‌లో వరుస దోపిడీలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని మొయినాబాద్ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని ఓ కొబ్బరి బొండాల దుకాణంలో గురువారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో యజమానుల కళ్లలో మిర్చి పొడి చల్లి దొంగలు దోపిడీకి పాల్పడి పరారయ్యారు. ఇదే తరహాలో రెండు నెలల క్రితం అమ్డాపూర్ గ్రామ నడిబొడ్డున ఓ ఇంట్లో దోపిడీ జరగగా, దసరా సందర్భంగా యాత్రకు వెళ్లిన కుటుంబం ఇంట్లోనూ మూడు రోజుల క్రితం మరో చోరీ జరిగింది. ఈ ఘటనల్లో మిర్చి పొడి చల్లి, డాగ్ స్క్వాడ్‌కు సైతం చిక్కకుండా దొంగలు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. తాజా ఘటనపై ఫిర్యాదు అందకపోవడం గమనార్హం. దీని పై మొయినాబాద్ సీఐ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ కేసు పూర్తి వివరాలు తెలుసుకుని దర్యాప్తు చేస్తున్నామని, ఇలాంటి దోపిడీలకు పాల్పడే వారిని పట్టుకుని శిక్షించే వరకు విచారణ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పండుగల సమయంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రజల్లో తగిన చైతన్యం లేకపోవడం బాధాకరమని పేర్కొంటూ, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామ సర్పంచులు అవసరమైతే సొంత ఖర్చుతోనైనా భద్రతా చర్యలు చేపట్టి గ్రామాలను కాపాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు

## కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి: మంత్రి శ్రీధర్ బాబు...



**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం గురువారం శంషాబాద్‌లో నిర్వహించారు.ఈ సమావేశానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ , రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ నియోజకవర్గాల ఇంచార్జులు, పార్టీ ముఖ్య నాయకులు, జిల్లా కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి పాలనకు మద్దతుగా నిలుస్తూ విద్యావంతులు, ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి తమ అమూల్యమైన మద్దతు తెలపాలన్నారు. రాబోయే ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సమన్వయంతో సన్నద్ధం కావాలన్నారు. నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మండల, డివిజన్ కమిటీలు పూర్తి చేసుకొని పార్టీని బలోపేతం చేస్తూ అభ్యర్థి గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐసీసీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, టి రామ్మోహన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మనోహర్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, నియోజకవర్గ ఇంచార్జీలు, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, వికారాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షుడు దార సింగ్ జాదవ్, పీసీసీ నాయకులు, జిల్లా నాయకులు, మండల, డివిజన్ అధ్యక్షులు వివిధ కమిటి సభ్యులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
04
శుక్రవారం, హైదరాబాద్ | 23-10-2026 | సంపాదకీయం | EDITOR IAL | WWW.MAHAADAILY.COM

# కొడంగల్ లో సీఎం ఆత్మీయస్పర్శ

## అభిమానులు, స్థానిక నేతల శుభాకాంక్షల వెల్లువ
## సొంత నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి



(మహా నెట్ వర్క్ )

కొడంగల్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ప్రజలు, నాయకులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. దసరా సందర్భంగా సొంత నియోజకవర్గ ప్రజలతో సీఎం మమేకమయ్యారు. కొడంగల్ ప్రజల అభిమానం... అభివృద్ధిలో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తనకు రెట్టించిన ఉత్సాహాన్ని అందించిందని సీఎం సంతోషం వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో నియోజకవర్గ ప్రజలు తరలివచ్చి సీఎంకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. సీఎంను కలిసేందుకు, కరచాలనం చేసేందుకు, ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. సందర్భంగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని ప్రసిద్ధి చెందిన శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. పేదల తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని అత్యంత వైభవంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి బాలాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.















మహా పత్రిక
ANN తెలుగు





# యాసంగి సాగుపై రైతులకు సూచనలు

- ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**వలిగొండ అక్టోబర్ 22 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అక్కంపల్లి గ్రామంలో గురువారం రైతులకు యాసంగి సాగు గురించి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్మం డల అభివృద్ధి అధికారి జలంధర్ రెడ్డి సూచనలు చేశారు ఎల్నినో ప్రభావంతో యాసంగి పంటల సాగులో ఎదురయ్యే సమస్యలు భూగర్భ జలాల పరిరక్షణ ప్రత్యామ్నాయ పంటల సాగుపై అధికారులు రైతులకు పలు సూచనలు అందించారు ఎల్ నినో ప్రభావం కారణంగా యాసంగి సీజన్లో భూగర్భ జలాల మట్టం తగ్గే అవకాశం ఉందని దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి ఒత్తిడి పెరిగే పరిస్థితి ఏర్పడవచ్చు అని వివరించారు నీటి వినియోగాన్ని తగ్గించడంతోపాటు అందుబాటులో ఉన్న నీటి వనరుల సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎంపీడీవో జలంధర్ రెడ్డి సూచించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ రైతులు తదితరులు పాల్గొన్నారు



# రవాణా రంగా సమస్యలను పరిష్కరించండి..

- రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మంచిరెడ్డి రాజేందర్ రెడ్డి
- ఇబ్రహీంపట్నం రవాణాశాఖ అధికారికి వినతిపత్రం అందజేత

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 22 మహా**: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లారీ యజమానులు డ్రైవర్లు, క్లీనర్, హెల్పర్లు, రవాణ రంగారంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఎదుర్కొట్టిన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈరోజు ఇబ్రహీంపట్నం రవాణాశాఖ ఇన్ ఇన్ స్పెక్టర్ అమర్నాథ్ ను కలిసిన, లారీ యజమానులు రవాణా రంగానికి సంబంధించిన సమస్యలు వివరించి వాటి పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ కౌంటర్ సిగ్నేచర్ సింగల్ పర్మినెంట్, రెండు రాష్ట్రాల మధ్య లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఫిట్నెస్ రెన్యువల్ సమయంలో రేడియం స్టిక్కర్ల పేరుతో లారీ యజమానుల పై పడుతున్న అధిక ఆర్థిక వారాని వివరించాం. ఆన్లైన్ ఓపెన్ కాంపిటీషన్ ద్వారా కాంట్రాక్టర్లను ఎంపిక చేసి తక్కువ ధరలకు స్టిక్కర్లు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు సానుకూలంగా స్పందించారు. నిబంధనల ప్రకారం స్క్రాప్ చేసిన పాత వాహనాలకు పన్ను బకాయి నోటీసులు రావడం వల్ల యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించడం జరిగింది. నేషనల్ పర్మిట్ కు సంబంధించిన రియల్ టీడీ నిబంధనలు ఇసుక రవాణా వాహనాలకు వర్తించే ఏఐఎస్ 140 పరికరాలను నిబంధనల మధ్య ఉన్న సందీప్తదను వివరించడం జరిగిందని, ఒకే వాహనంపై అనవసరపు అదనపు ఖర్చు పడకుండా సంబంధిత నిబంధనలతో స్పష్టత ఇవ్వాలని కోరారు. లారీ డ్రైవర్ క్లీనర్ ఎంప్లాయిస్, ఇతర రవాణా రంగ కార్మికుల కుటుంబాలకు సామాజిక భద్రత, సంక్షేమ ప్రయోజనాలు అందేలా ఏర్పాటు చేస్తున్న వెల్ఫేర్ బోర్డులో అర్హులైన రవాణా రంగం కార్మికులందరికీ అవకాశం కల్పించాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, చెరుకూరి బిక్షపతి, నరుకుడి ప్రసాద్ నరేష్, రాజు గౌడ్, మహేష్, జంగయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ మరో రాబిన్ వుడ్.. పండుగ సాయన్న.

- బహుజనులకు.. రాజ్యాధికార స్థాపనకై పోరాడిన ధీరుడు
- దాన ధర్మాలలో అపర కర్ణుడు.
- కీసర సర్కిల్ ఏఎంసీ చంద్రశేఖర్

**జవహర్ నగర్, మహా** : భారత స్వాతంత్రోద్యమ (1900) కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లు, ఉద్యమాలకు ఒక సమాంతర చరిత్ర ఉందని కీసర సర్కిల్ ఏఎంసీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి సందర్భంగా గురువారం కీసర సర్కిల్ ఆఫీస్ లో పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి వందనం సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండగ సాయన్న 1860 నుండి 1900 సంవత్సరం వరకు జీవించి 30 _ 35 ఏళ్ల వయసులో మరణించాడని తెలిపారు. పండుగ సాయన్న తెలంగాణ రాబిన్ వుడ్ గా సుపరిచితుడని ప్రజలను దోసుకుంటున్న దొరల, దేశ్ముకుల సంపన్నుల ఆస్తులను తీసుకొని ఇవ్వకపోతే దోచుకొని పేదలకు పంచిన ధీరుడని పండుగ సాయన్న కీర్తి ప్రతిష్టలు దేశానికే గర్వ కారణం అన్నారు. ఆనాటి నిరంకుశ నిజాం అధికారాలను ప్రశ్నించి వారిని ఎదిరించి తన సొంత పాలన వ్యవస్థను స్థాపించుకున్న ధీరుడు అని సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించడానికి ప్రయత్నం చేశాడని కానీ ఆధిపత్య శక్తులైన దేశముకులు, కరణం పటేళ్లు భూస్వాములు పథకం వేసి ఆనాటి నిజాం ప్రభుత్వం చేత సాయన్నను చంపించాలని తెలిపారు. అటువంటి మహావీరుని జయంతి ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కీసర సర్కిల్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగల సాయన్న జయంతి..

- సమానత్వం సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు పండుగల సాయన్న
- జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి
- జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా 174వ జయంతి వేడుకలు
- సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం...
- తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**: సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగల సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరై పండుగల సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి మాట్లాడుతూ... దాదాపు 150 సంవత్సరాల క్రితం సమాజంలో చట్టపరమైన రక్షణలు పరిమితంగా ఉన్న సమయంలో నిజాం పాలనలోని నిరంకుశత్వం, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలను ఎదిరించి, పేదలు మరియు బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన గొప్ప మానవతావాది పండుగల సాయన్న అని పేర్కొన్నారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను సహించలేక, పేద ప్రజల కోసం పోరాడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతుండటం ఆందోళనకరమని ఆమె అన్నారు. ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతుండగా, పేదలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో, చట్టాలకు లోబడి ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఐకమత్యం ఎంతో అవసరమని, అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం...**

తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్‌యాదవ్ మాట్లాడుతూ, పండుగల సాయన్న 174వ జయంతిని నిర్వహించుకుంటున్నప్పటికీ, ఆయన ఆశయాలైన సామాజిక సమానత్వం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాలకు న్యాయం వంటి లక్ష్యాలు నేటికీ పూర్తిస్థాయిలో నెరవేరలేదని అన్నారు. పేద ప్రజల పక్షాన నిలిచి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పండుగల సాయన్న మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం మెరుగోనిపల్లి గ్రామంలో సాయమ్మ, అనంతయ్య దంపతులకు ముదిరాజ్ కుటుంబంలో జన్మించారని ఆయన వివరించారు. చిన్నతనం నుంచే మల్లయుద్ధం, గ్రామీణ క్రీడల్లో పాల్గొంటూ దృఢమైన శరీరదారుఢ్యాన్ని పెంపొందించుకున్న సాయన్న, అప్పటి నిజాం పాలనలో భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, ఇతర ఆధిపత్య వర్గాల దోపిడీని, పేద ప్రజలపై జరుగుతున్న దౌర్జన్యాలను చూసి చలించిపోయారని తెలిపారు. పంటలు పండిన తర్వాత పేద రైతుల నుంచి బలవంతంగా పన్నులు వసూలు చేయడం, వారి భూములను లాక్కోవడం వంటి అన్యాయాలను ఎదిరించేందుకు సాయన్న తన స్నేహితులతో కలిసి ఒక దళాన్ని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. సంపన్నుల నుంచి దోచుకున్న సంపదను పేదలకు పంచడంతో పాటు, పేద ప్రజల వివాహాలకు బంగారం అందించి వారికి అండగా నిలిచేవారని వివరించారు. ప్రజల్లో సాయన్నకు పెరుగుతున్న ఆదరణను సహించలేని ఆధిపత్య వర్గాలు నిజాం పాలకులతో కలిసి కుట్రపూరితంగా ఆయనను హతమార్చాయని పేర్కొన్నారు. ధనవంతుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన బహుజన వీరుడు పండుగల సాయన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిపాలన అధికారి సునీల్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశురాం, ముదిరాజ్ మహాసభ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు కాకి వేణుగోపాల్, కాకి లక్ష్మణ్, ఆనియన్ ముదిరాజ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద*
- వరంగల్,కలెక్టరేట్ మహా;
- వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించారు.




ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పండుగ సాయన్న ముదిరాజ్ జీవిత చరిత్ర, ధైర్యసాహసాలు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు.ఆయన ఆశయాలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు.పండగ సాయన్న 1860 1900 మధ్య కాలానికి చెందిన వారు అని, వారు దానధర్మాలు చేసి ప్రజా నాయకుడిగా ప్రజల గుండెల్లో గుర్తింపు పొందారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ పండుగ సాయన్న జయంతి శుభాకాంక్షలు తెలిపారు. వారు గ్రామీణ క్రీడల్లో ఆరితేరిన వారిగా వారి జీవిత చరిత్ర చెబుతుందన్నారు. ఈ సందర్భంగా మేర కార్పొరేషన్ చైర్మెన్ వెంకట్రాజం మాట్లాడుతూ పండుగ సాయన్న జయతి ఉత్సవాలను అధికారికంగా జరుపుకోవడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు (రెవెన్యూ, స్థానిక సంస్థలు), ఉప సంచాలకులు ఎ. పుష్పలత, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కె. శంకరయ్య, సంబంధిత జిల్లా అధికారులతో పాటు ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ( మెపా ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, మెపా ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు వ్యవస్థాపక సభ్యులు బోనాల రమేష్, పులి రజనీకాంత్, చొప్పరి సోమయ్య, శానబోయిన రాజ్ కుమార్, పొన్నం మొగిలి, బండి సారంగపాణి, పులి రాజేష్, నవీన్, అమర్, పులి విక్రం, శ్రవణ్, మెపా హనుమకొండ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్, ఉపాధ్యక్షులు గోనెల విజేందర్, ఆళ్ల నరేష్, గంట వినోద్ కుమార్, శిరబోయిన సతీష్, మండల సమ్మయ్య, గంగరబోయిన కిరణ్, అరవింద్, ప్రశాంత్, ఆకుల సుభాష్, శ్రవణ్, విక్రమ్ వివిధ మండలాల అధ్యక్షులు కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



# నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పండుగ సాయన్న

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య



మంచిర్యాల మహా ప్రతినిధి : పెత్తందార్లు, భూస్వాములు, జమీందారీ వ్యవస్థతో పాటు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల అణచివేతను ఎదిరించి పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న అన్నారు. తెలంగాణ రాబిన్ హుడ్ గా పేరుగాంచిన ఆయన జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పేద ప్రజల కష్టాలను గుర్తించి వారి సంక్షేమానికి కృషి చేశారని, ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన ఆయన సేవలు మర్చిపోలేదు అని అన్నారు. ఇలాంటి మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సమానత్వం, సేవాభావం, పేదల పట్ల మానవత్వం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, బీసీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, ఎస్సీ అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా పరిషత్ సీఈఓ గణపతి, మత్స్య శాఖ అధికారి అవినాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఇద్దరు ప్రాజెక్టు అధికారులు

- బిల్లుల చెల్లింపునకు 10–25 శాతం డిమాండ్
- రూ.39.17 లక్షలు బదిలీ అయినట్లు గుర్తింపు

**భూపాలపల్లి, మహా ;** జయశంకర్ భూపాలపల్లి జిల్లా భాగీరథిపేట ప్రాజెక్టులోని పీఎంకేఎస్వై 2.0 విభాగంలో లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణల పై ప్రాజెక్టు అధికారి సతీశ్‌రెడ్డి, సాంకేతిక అధికారి రాజును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వరంగల్ రేంజ్ అధికారులు గురువారం అరెస్టు చేశారు. పథకం కింద చేపట్టిన పనుల బిల్లులు మంజూరు చేయడానికి, తదుపరి పనులు కేటాయించడానికి గుత్తేదారు నుంచి బిల్లు మొత్తంలో 10 నుంచి 25 శాతం వరకు డిమాండ్ చేశారని, చెల్లించకపోతే బిల్లులు నిలిపివేస్తామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏసీబీ నిర్వహించిన విచారణలో వివిధ బ్యాంకు, యూపీఐ ఖాతాల ద్వారా మొత్తం రూ.39,17,000 బదిలీ అయినట్లు తేలిందని అధికారులు తెలిపారు. బ్యాంకు స్టేట్‌మెంట్లు, వాట్సాప్ సంభాషణలను ఫిర్యాదుదారు సాక్ష్యాలుగా అందజేశారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.





# మంచిర్యాల జిల్లా కేంద్రంలో శాంతిభద్రతలు కాపాడాలి

**గ్యాంగ్ గొడవలు, మత్తుపదార్థాల వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలి**
**బీజేపీ మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి కస్తూరి నాగరాజు**

**మంచిర్యాల, మహా ప్రతినిధి :** మంచిర్యాల నియోజకవర్గంలో పెరుగుతున్న గ్యాంగ్ గొడవలు, బహిరంగ దాడులు, యువతలో మత్తుపదార్థాల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు భద్రత కల్పించాలని బీజేపీ మంచిర్యాల జిల్లా అధికార ప్రతినిధి, కార్పొరేటర్ కస్తూరి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. ఈమధ్య మంచిర్యాల నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న గ్యాంగ్ గొడవలు, దాడులతో సామాన్య ప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా కొనసాగుతున్న ఆధిపత్య పోరాటాల్లో యువకులను వాడుకుంటూ వారి జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నారని, మత్తుకు బానిసలైన యువతను గొడవలు, దాడులకు ప్రేరేపిస్తున్నారనే ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరపాలని కోరారు. యువత భవిష్యత్తును కాపాడటంతో పాటు మత్తుపదార్థాల సరఫరా, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తరచూగా చోటుచేసుకుంటున్న గొడవల వల్ల ప్రజలు స్వేచ్ఛగా జీవించలేని పరిస్థితి నెలకొందని, ఇది వ్యాపార వాతావరణాన్ని, పెట్టుబడులను కూడా దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిరసనలు చేపట్టినప్పుడు పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించి నాయకులను నియంత్రిస్తున్న పోలీసులు, శాంతిభద్రతల పరిరక్షణలో అదే స్థాయి సమర్థత ఎందుకు చూపడం లేదని ఆయన ప్రశ్నించారు. పోలీసు ఉన్నతాధికారులు సమీక్షించి జవాబుదారీతనంతో కూడిన పోలీసింగ్ అందించాలని ఆయన హితవు పలికారు.

# ఈనెల 24న చలో సరూర్ నగర్

**స్వర్ణకారుల కరపత్రం ఆవిష్కరణ**
**కొల్లోజు శివకుమార్**

**భువనగిరి అక్టోబర్ 22 మహా న్యూస్ :** ఈ నెల 24న హైదరాబాద్ సరూర్నగర్ లో జరుగు స్వర్ణకారుల మహాసభను విజయవంతం చేయాలని గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండల కేంద్రంలో కరపత్రం ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా జిల్లా నాయకులు కోల్లోజు శివకుమార్ మాట్లాడుతూ స్వర్ణకారుల మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు



# ఆన్ లైన్ పెట్టుబడి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత**

**హనుమకొండ, మహా ;** ప్రజలు ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ సూచించారు. క్యూ వి ఎస్ ఈ యాప్ ద్వారా పెద్ద ఎత్తున ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు జరుగుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర సైబర్ క్రైమ్ విభాగాలు హెచ్చరించాయని తెలిపారు.ఈ మోసంలో భాగంగా సైబర్ నేరగాళ్లు బాధితులను క్యూ వి ఎస్ ఈ యాప్ ఏపీకే ఫైల్ ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలని ప్రేరేపిస్తున్నారు. అనంతరం భారతీయ రూపాయలను ఎక్స్ఛేంజ్ ద్వారా క్రిప్టోకరెన్సీగా మార్చి పెట్టుబడి పెట్టాలని సూచిస్తున్నారు. కనీసం 500 యు ఎస్ డి టి (సుమారు రూ.54,000) పెట్టుబడి పెడితే 1 శాతం లాభం వస్తుందని ఆశ చూపుతున్నారు. అంతేకాకుండా, ఇతరులను యాప్‌లో చేర్పిస్తే మొదటి స్థాయి రిఫరల్‌కు 50 యు ఎస్ డి టి, రెండో స్థాయి రిఫరల్‌కు 25 యు ఎస్ డి టి ఇస్తామని నమ్మిస్తున్నారు. ఈ తరహా మోసాలకు సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 56 కేసులు నమోదయ్యాయని తెలిపారు.ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి. త్వరగా ఫిర్యాదు చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.



# ఆర్యవైశ్య దుర్గాదేవి నవరాత్రి మహోత్సవ వేడుకలకు అరుదైన రికార్డు నమోదు

- ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు

ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ మడుపు రాంప్రకాష్ చేతుల మీదుగా బెల్లంపల్లి ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులకు అవార్డు, ప్రశంసా పత్రం అందజేత

**బెల్లంపల్లి ,మహా**: బెల్లంపల్లి పట్టణంలోని శ్రీ వాసవి పంచాయతీని క్షేత్రం ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల వేడుకలలో భాగంగా బుధవారం రోజు రాత్రి ఆర్యవైశ్య బృందం బృందం 1500 ప్రతినిధులతో భజన, కోలాటం ప్రదర్శన, కోలాటం ఒగ్గు కళాకారులతో నృత్య ప్రదర్శన,చిరుతల రామాయణం కళాకారులతో నృత్య ప్రదర్శన లతో అత్యంతవైభవంగా ఉత్సవవేడుకలను పట్టణంలోని ప్రధాన రహదారి గుండా నిర్వహించగా చంద్రాపూర్ బ్యాండ్,మహిళల కోలాటాలతో, భజన బృందం వారితో బెల్లంపల్లిలో మొట్ట మొదటిసారిగా డ్రోన్ సహకారంతో 10x20 సైజ్ ఎల్ఈడి ప్రదర్శన, డ్రోన్ హెలికాప్టర్ తో అమ్మ వారికి పుష్పార్చన మొట్ట మొదటిసారిగా 1008 మహిళా సోదరీమణులచే కుంకుమార్చన,లక్ష్మీనర సింహస్వామి,వరాహస్వామి ,ఆంజనేయ స్వామి వార్ల భారీ వేషాధారణలతో మహా ప్రదర్శన,శోభాయాత్రలో 1500 మందితో భారీప్రదర్శన నిర్వహించబడింది. సంబంధిత వేడుకలను ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో హాజరై ల అరుదైన రికార్డుగా నమోదుచేసి ప్రశంస పత్రాన్ని, అవార్డును సంబంధిత ప్రతినిధి తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ మడుపు రాంప్రకాష్ చేతుల మీదుగా ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధరంగాలలో విశేషమైన ప్రతిభ కనబరిచిన వారికి,అరుదైన సేవలకు, వినూత్నమైన రూపకల్పనలకు ప్రోత్సాహకరంగా లండన్ నగరంలోని ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. సంబంధిత సేవలలో నేటి దేశప్రధాని నరేంద్రమోడీ నాటి గుజరాత్ సి.ఎమ్. గా ఉన్న సమయంలోను వండర్ ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు కాబడ్డారని అదేవిధంగా పలువురు విశేష ప్రతిభను కనబరిచిన కళాకారులకు వినూత్న రూపకల్పనలు చేసిన నిపుణులకు తమ సంస్థలో చోటుదక్కడం తోపాటు ప్రశంసా పత్రం, అవార్డులను బహికరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అందులో భాగంగా బెల్లంపల్లిపట్టణం శ్రీ వాసవి పంచాయతన క్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా వివిధ కళారూపాలు పట్టణ ప్రజలను ఆకట్టుకోవడం జరిగిందని సంబంధిత ప్రదర్శనలు నిర్వహించిన బెల్లంపల్లి ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులకు తమ ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లలో చోటు దక్కిందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు మేడి పున్నం చంద్రు,ఉత్సవ కమిటీ అధ్యక్షులు నలుమాసు సంతోష్,యువజన సంఘం అధ్యక్షులు పుల్లూరు వెంకటేశ్వర్లు,మహిళా సంఘం అధ్యక్షురాలు బాల విజయలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం నాయకులు రేణికుంట్ల శ్రీనివాస్, బాల సంతోష్, దత్తాత్రేయ శ్రీనివాస్ ,బాల్ ప్రసాద్ తోపాటు కమిటీ కార్యవర్గసభ్యులు ఏర్పాటు చేసిన ఉత్సవ వేదికలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంస పత్రాలను, అవార్డులను స్టేట్ కోఆర్డినేటర్ మడుపు రాం ప్రకాష్ అందజేశారు. నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించి రాబోయే రోజుల్లోనూ ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం తోపాటు తమ సేవలను విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు.అనంతరం ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సభ్యులను శాలువాలతో సత్కరించారు.

# పత్తి కొనుగోళ్ళు ప్రారంభం

- మార్కెట్ యార్డులో కలెక్టర్ పూజలు
- జిల్లాలో 33 జిన్నింగ్ మిల్లులు, 18 కొనుగోలు కేంద్రాలు
- క్వింటాల్‌కు 9వేల 260 వరకు మద్దతు ధర..
- రైతులు ఇబ్బందులు పడవద్దు
- తేమ శాతం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచన



**ఆదిలాబాద్ మహా**: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చి మద్దతు ధరతో పాటు మెరుగైన ధర పొందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.గురువారం స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించిన పత్తి కొనుగోలు ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పత్తి తేమ శాతం పరీక్ష, తూకం ప్రక్రియను పరిశీలించి రైతులకు అందుతున్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 33 జిన్నింగ్ మిల్లులు, 18 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8,669 కాగా, జిల్లాలో ప్రైవేటు వ్యాపారులు ప్రస్తుతం రూ.9,260 వరకు ధర చెల్లిస్తూ పత్తిని కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోనే ఆదిలాబాద్‌లో అత్యధిక ధర లభించడం రైతులకు ప్రయోజనకరమైన విషయమన్నారు.పత్తిలో తేమ శాతం అధికంగా ఉండకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పత్తిని పూర్తిగా ఆరబెట్టి మార్కెట్‌కు తీసుకురావడం ద్వారా నాణ్యతను కాపాడుకోవడంతో పాటు మెరుగైన ధర పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. సీసీఐ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో తేమ శాతం పరీక్షించే యంత్రాల వినియోగంపై సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని యంత్రాల ద్వారా పారదర్శకంగా పరీక్షించి, నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని సూచించారు.రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ, డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు వేచి ఉండే సమయం తగ్గేలా తూకం, తేమ పరీక్ష, కొనుగోలు తదితర ప్రక్రియలను సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల కోసం 'రూపాయికే భోజనం' పథకం ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతు ప్రతినిధులతో స్థానిక పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. రానున్న రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పంట వ్యర్థాలను కాల్చవద్దని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు దెబ్బతినడంతో పాటు భూసారం, నేలలో తేమ తగ్గే అవకాశం ఉందన్నారు. పంట అవశేషాలను భూమిలోనే కలిపి సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే పంట వ్యర్థాలను పశుగ్రాసంగా ఉపయోగించుకోవడం ద్వారా పశువులకు మేత కొరతను నివారించవచ్చన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ, ఆదిలాబాద్‌లో పత్తికి క్వింటాల్‌కు రూ.9,260 వరకు ధర లభించడం రైతులకు శుభపరిణామమన్నారు. జమ్మికుంటలో రూ.9,250, వరంగల్‌లో రూ.9,110 ధరలు నమోదయ్యాయని తెలిపారు. పత్తి వాహనాలు రాంపూర్, బైపాస్ మార్గం మీదుగా మార్కెట్ యార్డుకు చేరుకోవాలని, తూకం పూర్తయిన వెంటనే పట్టీ తీసుకోవాలని రైతులకు సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, పత్తికి రూ.9,260 వరకు ధర లభించడం రైతులకు సంతోషకరమైన విషయమన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకుని పంటలను కాపాడుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, రైతు సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాట యోధుడు పండుగ సాయన్నకు ఘన నివాళి

**15వ బెటాలియన్‌లో జయంతి వేడుకలు.. యువతకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకం**

**సత్తుపల్లి, మహా :** ప్రజల హక్కుల కోసం పోరాడి, ధైర్యసాహసాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను గంగారం 15వ తెలంగాణ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్దబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న ప్రజల కోసం సాగించిన పోరాటాలు, చేసిన సేవలను అధికారులు గుర్తుచేశారు. ధైర్యం, ఆత్మగౌరవం, ప్రజాసేవ వంటి విలువలకు ఆయన జీవితం ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం కృషి చేసిన మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడంతోనే యువతలో సామాజిక స్పృహ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ ఏ. అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ బి. వినాయకరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# హమాలీసంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- బెల్లంపల్లి హమాలీ కార్మికుల సమావేశంలో
- అధ్యక్షుడు గెల్లి రాజలింగు యాదవ్

**బెల్లంపల్లి,మహా**:హమాలీసంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలనీ గురువారం నాడు బెల్లంపల్లి హమాలీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో అధ్యక్గుడు గెల్లి రాజలింగు యాదవ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ (THWU) రాష్ట్ర దశాబ్ది మహాసభలను విజయవంతం చేయడంపై చర్చించారు.హమాలీ కార్మికుల సమస్యలు, హక్కులు, సంక్షేమం, సంఘం బలోపేతం తదితర అంశాలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. హమాలీసంఘం అధ్యక్షుడు గెల్లి రాజలింగు మాట్లాడుతూ హమాలీ కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు .

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఘటితంగా పోరాడాలని, రాష్ట్ర మహాసభలకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.తెలంగాణ హమాలీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర దశాబ్ది మహాసభలు ఈ నెల 25న పెద్దపల్లి లోని శ్వేతనగర్ మార్కెట్ యార్డులో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభలకు హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సమ్మయ్య, నాగరాజు, శంకర్, రాజ్‌కుమార్, హమాలీ సంఘం నాయకులు,పలువురు కార్మికులు పాల్గొన్నారు.



# అధికారికంగా సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

- ప్రజాప్రతినిధులు అధికారుల నివాళ్లు
- ఆయన జీవితం ఆదర్శనీయమన్న వక్తలు

**ఆదిలాబాద్ మహా**: జిల్లా కేంద్రంలో గురువారం పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా అత్యంత ఘనంగా నిర్వహించారు.. వేడుకల్లో భాగంగా ద్వారకానగర్ రోడ్ లోని పండుగ సాయన్న విగ్రహానికి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయన్న చిత్రపటానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎంపీ గోడం నగేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష ముఖ్య అతిథులుగా హాజరై నివాళులు అర్పించి స్మరించుకున్నరు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయం మేరకు పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రతి జిల్లాలో అధికారికంగా నిర్వహించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. యువకులు, విద్యార్థులు పండుగ సాయన్న జీవిత చరిత్రను తెలుసుకొని, వారి బోధనలను నిత్య జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల కోసం, అణచివేతకు వ్యతిరేకంగా పండుగ సాయన్న చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా ఎస్సై, కానిస్టేబుల్, ఫౌండేషన్ కోర్సులకు దాదాపు 200 మందికి పైగా యువతకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, మత్స్యకార సంఘాల నాయకులు లేవనెత్తిన స్థలాలు, షెడ్లు, మత్స్యకార సొసైటీల సమస్యలు, చెరువులు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమస్యలను సంబంధిత డిపార్ట్‌మెంట్ల వారీగా సమీక్షించి, డీఎస్సీడీఓ సహకారంతో త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ, చరిత్రలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణకు పాటుపడిన గొప్ప నేత పండుగ సాయన్న అని కొనియాడారు. గతంలో పేద, చిన్న వర్గాల పక్షాన నిలిచి, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరించిన వారిని కొందరు తీవ్రవాదులుగా ముద్ర వేసేవారని గుర్తుచేశారు. సమాజంలో మార్పు కోసం శ్రమించిన వారి జీవిత చరిత్రలను అధ్యయనం చేసి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళితే తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. సాయన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ఆయనను అధికారికంగా గుర్తించడం ఎంతో సంతోషకరమని ఎంపీ పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష సతీష్ మాట్లాడుతూ, పండుగ సాయన్న ధైర్య సాహసాలు, పోరాట స్ఫూర్తి, ప్రజల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. పండుగ సాయన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన త్యాగాలు, ధైర్యం, ప్రజల పట్ల నిబద్ధత ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి బిసి సంక్షేమ అధికారి సునీత కుమారి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాములు, రవి, బిసి సంఘాల ప్రజాప్రతినిధులు శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు గురువారం కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ ఓపెన్ హౌస్, ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు పోలీస్ శాఖలోని వివిధ విభాగాల పనితీరు విధులు వాటి ప్రాధాన్యత గురించి అధికారులు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ మహిళలు బాలికల భద్రత కోసం చేపట్టే చర్యలు వేధింపుల నివారణ ఫిర్యాదుల స్వీకరణ బాధితులకు అందించే సహాయం గురించి వివరించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం మానవ అక్రమ రవాణాను అరికట్టడం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడంలో నిర్వహించే పాత్రను వివరించారు. భరోసా కేంద్రం ద్వారా మహిళలు బాలికలు చిన్నారులపై జరిగే నేరాలకు సంబంధించి బాధితులకు అందించే సహాయం కౌన్సెలింగ్ అవసరమైన సహాయక సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ మహిళల భద్రత కోసం చేపట్టే కార్యక్రమాలు మహిళలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి తీసుకునే చర్యలను వివరించారు. ఫింగర్ ప్రింట్ విభాగం క్లూస్ టీమ్ నేరస్థలాల్లో లభించే ఆధారాలను సేకరించడం వేలిముద్రల ఆధారంగా నేర పరిశోధనలో కీలక సమాచారాన్ని గుర్తించడం శాస్త్రీయ ఆధారాల ద్వారా కేసుల దర్యాప్తులో సహకరించే విధానాన్ని వివరించారు. అదేవిధంగా బాంబ్ డిస్పోజల్ టీమ్ వారు ఉపయోగించే పరికరాలు ప్రమాదాలను నివారించేందుకు తీసుకునే జాగ్రత్తలు డాగ్ స్క్వాడ్ సహాయంతో నేరాల పరిశోధన వంటి పలు అంశాలను వివరించారు. కమ్యూనికేషన్ విభాగం సమాచార వ్యవస్థ నిర్వహణలో పోషించే పాత్రను ఉపయోగించే పరికరాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా పోలీస్ శాఖలో వినియోగించే పరికరాలు నేర పరిశోధనలో ఉపయోగించే సాంకేతిక విధానాలు భద్రతా చర్యల గురించి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించారు. విద్యార్థులు పోలీస్ శాఖ పనితీరును దగ్గరగా తెలుసుకోవడంతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని మహిళలు బాలల భద్రతకు సంబంధించిన అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, సిఐలు శ్రీనివాస్, రాము, వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, యాసీన్, ఎస్సైలు శ్రీనివాస్, అరుణ, రమాదేవి, పోలీస్ అధికారులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



# పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

ఆధిపత్య వర్గాలపై పోరాడిన వీరుడు పండుగ సాయన్న

కలెక్టరేట్ పరిపాలనాధికారి అనంత రామకృష్ణ

భద్రాద్రి కొత్తగూడెం, మహా: పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని కలెక్టరేట్ పరిపాలనాధికారి అనంత రామకృష్ణ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ లో గురువారం పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ పరిపాలనాధికారి అనంత రామకృష్ణ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంత రామకృష్ణ మాట్లాడుతూ పండుగ సాయన్న జీవితం ఆయన పోరాట పటిమ పేద ప్రజల పట్ల చూపిన ఆదరణ భావితరాలకు ఆదర్శప్రాయమని తెలిపారు. సమాజంలో అణగారిన వర్గాలు పేద ప్రజలు ఎదుర్కొంటున్న అన్యాయాలు అణచివేతలకు వ్యతిరేకంగా నిలిచి పోరాడిన వ్యక్తిగా పండుగ సాయన్నకు ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. ప్రజల కష్టాలను అర్థం చేసుకుని వారి సంక్షేమం కోసం తన శక్తిని సామర్థ్యాన్ని వినియోగించిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఆకలితో అలమటించే ప్రజలకు ఆహారం అందించేందుకు సంపన్నుల ఇళ్లలోని ధాన్యపు గోదాముల నుంచి ధాన్యాన్ని తీసుకువచ్చి పేదలకు పంచిపెట్టేవారని తెలిపారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ దొరల ఆధిపత్యం అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించారని వివరించారు. ఇందుకోసం తనకంటూ ఒక దళాన్ని ఏర్పాటు చేసుకుని ఆయుధాలను సమకూర్చుకుని ప్రజల పక్షాన నిలిచారని తెలిపారు. చరిత్రలో ప్రజల కోసం పోరాడిన మహనీయుల జీవితాలను నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలో సమానత్వం న్యాయం మానవత్వం సేవాభావం వంటి విలువలను పెంపొందించుకోవడానికి పండుగ సాయన్న జీవితం స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ సమాజంలోని పేదలు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిని విజయలక్ష్మి, బీసీ కమ్యూనిటీ సంఘ నాయకులు సొప్పరి క్రాంతి, బండారి సాగర్, అక్కల మధు, అక్కల సీతారామయ్య, కె.పైడయ్య, ఊదర వెంకటస్వామి,



శ్రీనివాస్, ఎ.రాంబాబు, పి.వినయ్, కె.సమ్మయ్య, ఎన్.యాకయ్య, ఎ.సోమయ్య, హారిక, ఉషారాణి, జి .సంధ్యారాణి, ముదరుకోళ్ళ కిషోర్ తదితరులు కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## బాధలో బాసటగా.. కంది శ్రీనివాస రెడ్డి దంపతుల పరామర్శలు

**పలువురికి ఆర్థిక సాయాలు**

**ఆదిలాబాద్ మహా :** ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నవారి కుటుంబాలకు ,అనారోగ్యంతో బాధపడుతున్న వారి చెంతకు వెళ్లి వారికి కొండంత ధైర్యాన్ని ఇస్తారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. గురువారం ఆయన తన సతీమణి కంది మౌనాశ్రీనివాస రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి నియోజకవర్గం లోని జైనథ్ , బేల, సాత్నాల,మావల, తలమడుగు, భీంపూర్, తాంసీ మండలాలలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారిని ప్రమాదవశాత్తు చనిపోయిన వారి కుటుంబాలను అలాగే అనారోగ్యంతో బాధ పడుతున్నవారిని కలసి పరామర్శించారు. ఆయా కుటుంబాలను వారి నివాసాలలో కలిసి ధైర్యం చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగినేని శాంతన్ రావు,కొండ గంగాధర్ , దర్శనాల అశోక్, విఠల్ రెడ్డి , తమ్మల చందు, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి మహమూద్ క్యాతం శివప్రసాద్ రెడ్డి ఆయా మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







## ప్రమాద ప్రాంతంలో సింగరేణి విద్యుత్ వెలుగులు!

- కిష్టారం ఓసీ సమీపంలో వంద మీటర్ల మేర విద్యుత్ దీపాల ఏర్పాటు
- జీఎం వెంకటాచారి చొరవ.. ప్రాజెక్టు అధికారి సునీల్ వర్మ ఆధ్వర్యంలో చర్యలు
- వై జంక్షన్ వరకు లైట్లు ఏర్పాటు చేయాలని వాహనదారుల విజ్ఞప్తి



**సత్తుపల్లి, అక్టోబర్ 22** :మహా : కిష్టారం ఓపెన్‌కాస్ట్ (ఓసీ) పరిసర ప్రాంతంలో రాత్రివేళ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా సింగరేణి అధికారులు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. గత కొద్ది రోజుల క్రితం ఓసీ ప్రాంతానికి సుమారు వంద మీటర్ల వరకు లైట్లు అమర్చారు. సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ వెంకటాచారి ఆదేశాల మేరకు కిష్టారం ప్రాజెక్టు అధికారి సునీల్ వర్మ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ చర్యలపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల చొరవతో వెలుగులు**

కిష్టారం ఓసీ పరిసరాల్లో వాహనాల రద్దీ, రాత్రివేళల్లో ప్రయాణికులు, వాహన చోదకులకు ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. జీఎం వెంకటాచారి ఆదేశాలతో ప్రాజెక్టు అధికారి సునీల్ వర్మ పర్యవేక్షణలో లైట్లు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో వెలుతురు అందుబాటులోకి వచ్చింది. వాహనదారుల ఇబ్బందులను గుర్తించి విద్యుత్ దీపాల ఏర్పాటుకు చొరవ చూపడంపై సింగరేణి అధికారులను పలువురు అభినందిస్తున్నారు.

**వై జంక్షన్ వరకు వెలుగులు విస్తరించాలి**

కిష్టారం ఓసీ నుంచి లారీ యూనియన్ కార్యాలయం సమీపంలోని వై జంక్షన్ వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ మార్గంలో రాత్రివేళల్లో భారీ వాహనాల రాకపోకలు సాగుతుండటంతో తగిన వెలుతురు లేకపోతే ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికే విద్యుత్ దీపాల ఏర్పాటుకు చొరవ చూపిన జీఎం వెంకటాచారి, ప్రాజెక్టు అధికారి సునీల్ వర్మ స్పందించి మిగిలిన మార్గంలోనూ లైట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వై జంక్షన్ వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తే రాత్రివేళల్లో వాహనాల రాకపోకలు సురక్షితంగా సాగేందుకు దోహదపడుతుందని, ప్రమాదాల ముప్పు తగ్గుతుందని వాహనదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## కాంగ్రెస్ నేతల మర్యాదపూర్వక భేటీ

**మణుగూరు, మహా :** మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఛత్తీస్‌గఢ్ మాజీ మంత్రి, కుంట ఎమ్మెల్యే కవాసి లఖ్మాలను జిల్లా కాంగ్రెస్ నాయకుడు గురిజాల గోపి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సారపాక ఐటీసీ విశ్రాంతి భవనంలో ఇరువురు నేతలను కలిసిన ఆయన శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సుమారు గంటన్నర పాటు పినపాక నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పనితీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులపై అభిప్రాయాలను పంచుకున్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై చర్చించారు.

## పేదల సొంతింటి కలకు కాంగ్రెస్ సర్కారు సాకారం

- ద్వారకాపురి కాలనీలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి

**సత్తుపల్లి, అక్టోబర్ 22:మహా :** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ 12వ వార్డులోని ద్వారకాపురి కాలనీలో బూరుగు లలిత నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని గురువారం ఆమె ప్రారంభించారు. గృహప్రవేశం సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేస్తున్న లబ్ధిదారుల ఆనందం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఈ పథకం అమలుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇటీవల గుండెకు స్టెంట్ వేయించుకున్న లక్ష్మణాచారిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెహానా కమల్, కాంగ్రెస్ నాయకులు చల్లగుండ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, దామెర రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కొమురం భీం కు కంది శ్రీనివాస రెడ్డి నివాళ్లు

**ఆదిలాబాద్ మహా** : జల్ జంగిల్ జమీన్ కోసం పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడు కొమురం భీం అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.గురువారం కొమురంభీం జయంతిని పురస్కరించుకొని కొమురంభీం చౌక్ లో గల విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు.ఆదివాసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసారని కొనియాడారు. ఆయన ఆశయాలకనుగుణంగా ఆదివాసీలు విద్యా , రాజకీయం సహా అన్నిరంగాలలో రాణించాలని ఆకాక్షించారు. తెలంగాణ లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదవాసీల సంక్షేమం కోసం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగినేని శాంతన్ రావు,కొండ గంగాధర్ , దర్శనాల అశోక్, విఠల్ రెడ్డి , తమ్మల చందు, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి మహమూద్ క్యాతం శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శారదా దేవి సేవలో కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

**ఆదిలాబాద్ మహా** : ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తన సతీమణి కంది మౌన శ్రీనివాస రెడ్డి తో కలిసి బేల మండలంలో పర్యటించారు. మండలం లోని కొబ్బాయి , బెదోడ గ్రామంలో నిర్వహించిన పలు శారదా దేవి ల నిమజ్జన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు మండల నాయకులు కార్యకర్తలు ప్రజలతో కలిసి పాల్గొన్నారు. అమ్మవార్లను దర్శించి పూజలు చేసారు. అనంతరం స్థానిక మహిళలు యువతులతో కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేసి అలరించారు.పార్టీ శ్రేణులు గ్రామస్తులు కంది శ్రీనివాస రెడ్డి దంపతులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగినేని శాంతన్ రావు,కొండ గంగాధర్ , దర్శనాల అశోక్, విఠల్ రెడ్డి , తమ్మల చందు, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి మహమూద్ క్యాతం శివప్రసాద్ రెడ్డి బేల మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ కార్డులు అందజేయాలి..

- వైద్య సేవల అమలుపై ఐఎఫ్‌టీయూ హర్షం..
- సింగరేణి అధికారులకు వినతిపత్రాలు అందజేత

**మణుగూరు, మహా :** సింగరేణి మణుగూరు ఏరియాలో కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై ఐఎఫ్‌టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్మికులందరికీ ఈఎస్ఐ గుర్తింపు కార్డులు అందజేయాలని కోరుతూ గురువారం ఏరియా ఎస్ఓటు జీఎం డివి రామారావు, ఏజీఎం (పర్సనల్) ఎస్ రమేష్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.డి.నాసర్‌పాషా మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సేవలు అందుబాటులోకి రావడం హర్షణీయమన్నారు. అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్ల ద్వారా గుర్తింపు కార్డులతో కూడిన ఈఎస్ఐ మెడికల్ కార్డులు ఇప్పించాలని కోరారు. కార్మికులందరికీ పీఎఫ్ స్లిప్పులు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు కొన్ని విభాగాల కార్మికులకు ఇప్పటికీ అందని రూ.5,500 ప్రత్యేక ప్రోత్సాహకాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఏరియా అధ్యక్షుడు అంగోత్ మంగీలాల్, నాయకుడు పి.మధు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో.. ఘనంగా కొమురం భీమ్ జయంతి వేడుకలు..

- ఆదివాసీల హక్కులకై పోరాడిన వీరుడు భీమ్..
- ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దాం..
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్..

**మణుగూరు, మహా :** ఆదివాసీల హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు కొమురం భీమ్ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిరునాకి నవీన్ అన్నారు. గురువారం కొమురం భీమ్ జయంతిని పురస్కరించుకుని మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీలకు అడవి, భూమి, నీటిపై హక్కుల కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు కొమురం భీమ్ అని కొనియాడారు. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, సర్పంచులు కలబోయిన మాధవరావు, పూనెం రమేష్, కారం పూజిత, జగిడి ప్రసాద్, నియోజకవర్గ నాయకులు కాటిబోయిన నాగేశ్వరరావు, జీవీ, మండల నాయకులు కొమరం రామ్మూర్తి, దొడ్డపనేని మధు, చప్పిడి సుబ్రమణ్యం, షేక్ యాకుబ్ అలీ, చింతల కృష్ణ, బొజ్జ త్రిమూర్తులు, బత్తుల శ్రీను, యువజన నాయకుడు కట్ట మహేష్ తదితరులు పాల్గొన్నారు.





## పండగ సాయన్న జయంతి వేడుకలో కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

**ఆదిలాబాద్ మహా :** నిజా నిరంకుశత్వానికి, దొరలకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ ప్రజల రాబిన్ హుడ్ పండగ సాయన్న అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం ముదిరాజ్ ముద్దుబిడ్డ ప్రజావీరుడు పండగ సాయన్న జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహం వద్ద తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి నివాళ్లు అర్పించారు. ఉన్నావాళ్లను కొట్టి పేదలకు పంచిన రాబిన్ హుడ్ అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం, అణచివేతకు వ్యతిరేకంగా పండుగ సాయన్న చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగినేని శాంతన్ రావు,కొండ గంగాధర్ , దర్శనాల అశోక్, విఠల్ రెడ్డి , తమ్మల చందు, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి మహమూద్ క్యాతం శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ చైర్మన్ కుటుంబానికి సర్పంచ్ పరామర్శ



**పెద్దపల్లి మహా :** కమాన్‌పూర్: కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు తండ్రి సాంబయ్య మృతి చెందడంతో, కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామంలోని ఆయన నివాసానికి మొట్లపల్లి సర్పంచ్ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సాంబయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి మనోధైర్యం కల్పించారు.

# బాక్సాఫీస్‌పై విశ్వక్ సేన్ ట్రిపుల్ ఎటాక్!

**కామెడీ, పొలిటికల్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు.. విజయమే లక్ష్యంగా మాస్ కా దాస్**

టాలీవుడ్ యువ హీరో విశ్వక్ సేన్ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. సాధారణంగా ఒక సినిమా విడుదలైన తర్వాత మరో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి హీరోలు కొంత సమయం తీసుకుంటారు. అయితే విశ్వక్ సేన్ మాత్రం కేవలం 36 రోజుల వ్యవధిలో మూడు సినిమాలను విడుదల చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. భిన్నమైన కథలు, విభిన్నమైన జానర్లతో బాక్సాఫీస్ వద్ద తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

విశ్వక్ సేన్ స్వయంగా దర్శకత్వం వహిస్తూ నటిస్తున్న చిత్రం 'కల్ట్'. యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని 2026 అక్టోబర్ 30న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కథ, స్క్రీన్‌ప్లే బాధ్యతలను కూడా విశ్వక్ సేన్ నిర్వహించడం ఈ ప్రాజెక్ట్‌లో ప్రత్యేకత. నటుడిగా మాత్రమే కాకుండా దర్శకుడిగానూ తన ప్రతిభను చాటుకోవాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. కల్ట్' విడుదలైన కొద్ది రోజులకే విశ్వక్ సేన్ మరో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' నవంబర్ 19న థియేటర్లలోకి రానుంది. గతంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'ఈ నగరానికి ఏమైంది' చిత్రానికి కొనసాగింపుగా ఈ సినిమా రూపొందుతోంది. స్నేహం, వినోదం, యువతకు నచ్చే అంశాలతో ఈ సీక్వెల్‌పై అంచనాలు ఏర్పడ్డాయి. పాత చిత్రంలోని నటీనటులు మళ్లీ కలిసి కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. వరుసలో మూడో చిత్రంగా 'లెగసీ' డిసెంబర్ 4న విడుదలకు సిద్ధమవుతోంది. సాయికిరణ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా పొలిటికల్ యాక్షన్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అధికార రాజకీయాలు, కుటుంబ సంబంధాలు వంటి అంశాలతో కూడిన కథలో విశ్వక్ సేన్ మరో భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఒకే నెలకు పైగా వ్యవధిలో మూడు విభిన్న కథలతో ప్రేక్షకులను పలకరించడం ఆయన కెరీర్‌లో ఆసక్తికరమైన పరిణామంగా చెప్పవచ్చు. ఇటీవల విడుదలైన కొన్ని చిత్రాలు ఆశించిన ఫలితాలను అందుకోకపోయినా విశ్వక్ సేన్ తన తదుపరి ప్రాజెక్టులతో ముందుకు సాగుతున్నారు. వరుస విడుదలలు ఆయనకు మంచి అవకాశాన్ని అందించవచ్చు. అయితే మూడు సినిమాల ప్రమోషన్లు, ప్రేక్షకుల ఆసక్తిని నిలబెట్టుకోవడం, బాక్సాఫీస్ వద్ద పోటీని ఎదుర్కోవడం వంటి అంశాలు కీలకం కానున్నాయి. దు సినిమాలు మూడు భిన్నమైన జానర్లలో ఉండటం విశ్వక్ సేన్‌కు కలిసొచ్చే అంశం. యాక్షన్‌ను ఇష్టపడేవారికి 'కల్ట్', కామెడీని కోరుకునేవారికి 'ఈ నగరానికి ఏమైంది రిపీట్', రాజకీయ నేపథ్య కథలను ఇష్టపడేవారికి 'లెగసీ' ఆకర్షణగా నిలవవచ్చు. ఈ మూడు చిత్రాల్లో ఏది ప్రేక్షకుల ఆదరణను ఎక్కువగా పొందుతుంది? ఏ సినిమా విశ్వక్ సేన్‌కు భారీ విజయాన్ని అందిస్తుంది? అన్నది విడుదలల తర్వాతే స్పష్టమవుతుంది.



## మింట్ గ్రీన్ చీరలో మెరిసిన షామా సికందర్..
# అందంతో కట్టిపడేస్తున్న ముద్దుగుమ్మ!

సినిమా తారలు వెండితెరపైనే కాకుండా తమ ఫ్యాషన్ లుక్స్‌తోనూ అభిమానులను ఆకట్టుకుంటుంటారు. ముఖ్యంగా సంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తూ ఆధునిక అందాలను జోడించే కథానాయికల ఫొటోలు సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. ఈ జాబితాలో బాలీవుడ్ నటి షామా సికందర్ తనదైన శైలితో అభిమానులను అలరిస్తున్నారు. తాజాగా మింట్ గ్రీన్ రంగు సీక్వెన్స్ చీరలో ఆమె మెరిసే లుక్ ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది.

**సంప్రదాయ అందానికి గ్లామర్ టచ్!**

మింట్ గ్రీన్ రంగు చీరకు మెరిసే సీక్వెన్స్ డిజైన్ జత కావడంతో ఈ లుక్‌కు ప్రత్యేకమైన ఆకర్షణ వచ్చింది. లేత ఆకుపచ్చ రంగు ప్రశాంతమైన అందాన్ని అందిస్తుండగా, చీరపై మెరిసే అలంకరణలు ఆధునిక హంగులను జోడిస్తున్నాయి. సంప్రదాయ చీరకట్టులోనూ స్టైలిష్‌గా కనిపించవచ్చని షామా తన ఫ్యాషన్ ఎంపికతో చాటిచెబుతున్నారు.

చీరను అందంగా ధరించి, తగిన మేకప్, ఆభరణాలతో లుక్‌ను పూర్తి చేసుకోవడం ఫ్యాషన్ ప్రపంచంలో ప్రత్యేకతను తీసుకొస్తుంది. షామా సికందర్ ఫొటో షూట్‌లోనూ ఈ తరహా స్టైలింగ్ అంశాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. భారీ రంగుల హంగులు లేకుండా లేత రంగులో మెరుపుల డిజైన్‌ను ఎంచుకోవడం ఈ లుక్‌కు మరింత ప్రత్యేకతను అందిస్తోంది.

**ఫ్యాషన్ ప్రియులకు కొత్త స్టైల్ ఐడియా**

పెళ్లిళ్లు, పండుగలు, ప్రత్యేక వేడుకలకు చీరలో కొత్తదనం కోరుకునేవారికి మింట్ గ్రీన్ రంగు మంచి ఎంపికగా నిలవవచ్చు. ముఖ్యంగా సీక్వెన్స్ వర్క్ ఉన్న చీరలను ఎంచుకున్నప్పుడు ఆభరణాలను తక్కువగా ఉపయోగించి సింపుల్‌గా స్టైల్ చేసుకుంటే అందం మరింతగా కనిపిస్తుంది. చీర రంగుకు సరిపోయే బ్లౌజ్, సున్నితమైన మేకప్, అందమైన హెయిర్‌స్టైల్‌తో సంప్రదాయ రూపానికి ఆధునిక మెరుపును జోడించవచ్చు.

**నటిగా ప్రత్యేక గుర్తింపు**

షామా సికందర్ హిందీ టెలివిజన్, సినిమాలు, వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. యే మేరీ లైఫ్ హై వంటి టెలివిజన్ కార్యక్రమాలతో ప్రేక్షకులకు చేరువయ్యారు. నటనతో పాటు ఫ్యాషన్ ఫొటోషూట్లు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా కూడా తన అభిమానులతో అనుసంధానమవుతున్నారు. విభిన్నమైన దుస్తుల ఎంపికలతో తన వ్యక్తిగత శైలిని ప్రదర్శిస్తున్నారు.మొత్తానికి, మింట్ గ్రీన్ సీక్వెన్స్ చీరలో షామా సికందర్ లుక్ సంప్రదాయ వస్త్రధారణకు గ్లామర్‌ను జోడించే విధంగా ఉంది. రంగుల ఎంపిక నుంచి చీర డిజైన్ వరకు ఫ్యాషన్‌పై ఆసక్తి ఉన్నవారికి ఈ ఫొటోలు మంచి స్టైల్ స్ఫూర్తిని అందిస్తున్నాయి.

గమనిక: ఈ కథనం వార్తాపత్రిక ప్రచురణ కోసం స్వతంత్రంగా రూపొందించిన తెలుగు రచన. ఫొటోల వినియోగానికి సంబంధించి అసలు ప్రచురణకర్త లేదా ఫొటోగ్రాఫర్ అనుమతులు, క్రెడిట్ నిబంధనలు విడిగా నిర్ధారించాలి.



# బాహుబలిని మించే సినిమా రాజమౌళితోనే సాధ్యమా?



భారతీయ సినీ పరిశ్రమలో భారీ చిత్రాలకు కొత్త గుర్తింపు తెచ్చిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి. ఆయన తెరకెక్కించిన 'బాహుబలి' రెండు భాగాలు దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు తెలుగు సినిమా స్థాయిని మరింత పెంచాయి. ఆ తర్వాత వచ్చిన 'ఆర్ఆర్ఆర్' అంతర్జాతీయంగా గుర్తింపు సాధించడంతో రాజమౌళి పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగింది. ఇప్పుడు ఆయన నుంచి మరో భారీ చిత్రం ఎప్పుడు వస్తుందనే ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది.

'బాహుబలి' విజయం కేవలం వసూళ్లకే పరిమితం కాలేదు. భారీ సెట్లు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, బలమైన పాత్రలు, భావోద్వేగాలతో కూడిన కథనం ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాయి. ఈ తరహా చిత్రాన్ని రూపొందించాలంటే భారీ బడ్జెట్‌తో పాటు ఎన్నో ఏళ్ల శ్రమ, పక్కా ప్రణాళిక అవసరం. అందుకే ఆ స్థాయి సినిమాలను తెరకెక్కించడం దర్శక నిర్మాతలకు పెద్ద సవాలుగా మారుతోంది.

ప్రస్తుతం రాజమౌళి, మహేశ్ బాబు కలయికలో రూపొందుతున్న 'వారణాసి'పై భారీ అంచనాలు ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయి కథాంశం, సాహసాలతో కూడిన ఈ ప్రాజెక్ట్ ద్వారా మరోసారి భారతీయ సినిమాను ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం చేయాలని చిత్ర బృందం ప్రయత్నిస్తోంది. ఈ సినిమా 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' విజయాలను అధిగమిస్తుందా అన్న చర్చ కూడా అభిమానుల్లో కొనసాగుతోంది.

మరోవైపు, భారీ చిత్రాల నిర్మాణంలో పెట్టుబడుల రిస్క్ కూడా కీలక అంశం. వందల కోట్ల రూపాయల బడ్జెట్‌తో తెరకెక్కించే సినిమాకు కథ, నటీనటులు, సాంకేతిక నాణ్యత, మార్కెటింగ్ వంటి అంశాలు సమన్వయంతో పనిచేయాలి. ఏ చిన్న లోపం జరిగినా నిర్మాతలకు భారీ నష్టాలు వచ్చే అవకాశం ఉంటుంది. రాజమౌళి మాత్రం కథపై నమ్మకం, సాంకేతికత వినియోగం, ప్రేక్షకుల అభిరుచులపై అవగాహనతో తన సినిమాలను ప్రత్యేకంగా నిలబెడుతున్నారు.ఇదిలా ఉండగా, 'బాహుబలి' ప్రపంచాన్ని మరింత విస్తరించే యానిమేషన్ ప్రాజెక్ట్ 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా ఆసక్తిని పెంచుతోంది. అయితే ఇది 'బాహుబలి 3' కాదని గతంలో రాజమౌళి స్పష్టం చేశారు. దీంతో ఆయన తదుపరి భారీ ప్రాజెక్ట్ ఏ స్థాయిలో ఉండబోతోందన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

మొత్తానికి, 'బాహుబలి' స్థాయిని మించే సినిమా రావాలంటే భారీ బడ్జెట్ ఒక్కటే సరిపోదు. బలమైన కథ, సాంకేతిక నైపుణ్యం, భావోద్వేగాలు, ప్రేక్షకులను ఆకట్టుకునే కథనం అవసరం. రాజమౌళి తదుపరి చిత్రాలు భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్తాయా అన్నది ఆసక్తికరంగా మారింది.



## ఆస్ట్రియా సరస్సు ఒడ్డున సోఫీ చౌదరి
# స్టైలిష్ లుక్!

ప్రకృతి అందాల నడుమ ఫొటోషూట్.. ఫ్యాషన్‌తో ఆకట్టుకుంటున్న సింగర్, నటి**

సినీ తారలు సినిమాలతో పాటు తమ విహారయాత్రలు, ఫ్యాషన్ ఫొటోషూట్లతోనూ అభిమానులను ఆకట్టుకుంటుంటారు. ఈ క్రమంలో సింగర్, నటి సోఫీ చౌదరి తన ప్రత్యేకమైన స్టైల్‌తో మరోసారి చర్చల్లో నిలుస్తున్నారు. ఆస్ట్రియా ప్రకృతి అందాల నేపథ్యంలో మెరూన్ రంగు స్విమ్‌సూట్‌లో ఆమె కనిపించిన ఫొటోలు ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షించేలా ఉన్నాయి.

**ప్రకృతి అందాల మధ్య ప్రత్యేక ఆకర్షణ**

చుట్టూ పచ్చని ప్రకృతి, ప్రశాంతమైన సరస్సు వాతావరణం పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేకమైన అందాన్ని తీసుకొస్తాయి. అలాంటి నేపథ్యంలో సోఫీ చౌదరి తన వెకేషన్ లుక్‌తో ప్రత్యేకంగా నిలిచారు. ముదురు మెరూన్ రంగు దుస్తుల ఎంపిక ఆమె లుక్‌కు ఆధునిక హంగును జోడిస్తోంది. సాధారణంగా ఫ్యాషన్ ఫొటోషూట్లలో దుస్తుల రంగుతో పాటు ఫొటోలు తీసిన ప్రదేశం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఈ ఫొటోల్లో ప్రకృతి అందాలు, దుస్తుల రంగు కలయిక ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

**ఫ్యాషన్‌లో తనదైన శైలి**

సోఫీ చౌదరి గ్లామర్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. సింగర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, తర్వాత నటిగా, టెలివిజన్ వ్యాఖ్యాతగా కూడా ప్రేక్షకులకు చేరువయ్యారు. విభిన్నమైన దుస్తుల ఎంపికలు, ట్రెండీ లుక్స్‌తో సోషల్ మీడియాలోనూ అభిమానులను అలరిస్తుంటారు. వెకేషన్ ఫొటోల్లోనూ తన వ్యక్తిగత ఫ్యాషన్ అభిరుచిని ప్రతిబింబించేలా కనిపించడం ఆమె ప్రత్యేకతగా చెప్పవచ్చు.

**వెకేషన్ ఫ్యాషన్‌కు కొత్త స్ఫూర్తి**

ప్రయాణాల సమయంలో తీసుకునే ఫొటోలు కేవలం జ్ఞాపకాలుగానే కాకుండా ఫ్యాషన్ ట్రెండ్లకు కూడా వేదికగా మారుతున్నాయి. ముఖ్యంగా సరస్సులు, బీచ్‌లు, పర్వత ప్రాంతాల వంటి ప్రకృతి నేపథ్యాల్లో తీసే ఫొటోషూట్లు సోషల్ మీడియాలో ఎక్కువగా ఆకర్షిస్తుంటాయి. దుస్తుల రంగు, సహజమైన వెలుతురు, ఫొటో తీసిన ప్రదేశం కలిసినప్పుడు చిత్రాలకు ప్రత్యేకమైన రూపం వస్తుంది. త్తంగా, ఆస్ట్రియా సరస్సు పరిసరాల్లో సోఫీ చౌదరి మెరూన్ స్విమ్‌సూట్‌లో కనిపించిన లుక్ వెకేషన్ ఫ్యాషన్‌పై ఆసక్తి ఉన్నవారికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సంగీతం, నటనతో పాటు తన స్టైలిష్ ఫొటోలతోనూ అభిమానులను పలకరిస్తున్న ఆమె, మరోసారి ఫ్యాషన్ చర్చల్లో చోటు సంపాదిస్తున్నారు.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034